

రాజంపేట పాఠశాలలో సమ్మర్ క్యాంప్

రాజంపేట, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): రాజంపేట కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో మే 1 నుంచి 15 వరకు పాఠశాలలో సమ్మర్ క్యాంపు నిర్వహించడం జరుగుతుందని ఎంఈవో పూర్ణచందర్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాల విద్యార్థులు పాల్గొనాలని తెలిపారు. ఈ క్యాంపు కోచ్ శివగౌడ్ 76608 68926 నెంబర్‌కు సంప్రదించాలని తెలిపారు.

వన్యప్రాణుల.. అరణ్య రోదన



- జిల్లాలో 2లక్షల ఎకరాల్లో అటవీ విస్తీర్ణం
- అరణ్యంలో నీటి కోసం అలమటిస్తున్న అటవీ జంతువులు
- అడవుల్లో వట్టిపోయిన చెలిమలు, కుంటలు
- కొన్ని ప్రాంతాల్లో ఖాళీగా దర్శనమిస్తున్న సాసర్‌పిట్లు
- నీరు లేక మృత్యువాత పడుతున్న మూగజీవాలు
- అడవులు దాటి.. జనాల్లోకి జంతువులు
- నీటి కోసం గ్రామాల్లోకి వస్తూ మృత్యువాత పడుతున్న అటవీ జంతువులు
- నీటి సాకర్యం కల్పించాలంటున్న జంతు ప్రేమికులు

కామారెడ్డి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): వేసవిలో మనుషులే కాదు.. ఇతర జీవులు ఎండ వేడిమితో ఉక్కిరిబిక్కిరి కావడం తెలిసిందే. సమయానికి తాగునీరు దొరకకపోతే అవస్థలు పడక తప్పదు. నిత్యం జనా వాసంలో సంచరించే జంతువులు, పక్షులకు నీటి కొరత ఉండకపోవచ్చు. కానీ వన్యప్రాణుల తిప్పలు అన్నీ ఇన్ని కావు. ఇప్పటికే ఎండల తీవ్రతతో వాగులు, వంకలు చెలిమలు వట్టిపోతున్నాయి. దీంతో అటవీ ప్రాంతాల్లోని వన్యప్రాణులు నీటి జాడ కోసం అల్లాడుతున్నాయి. అడవుల్లోని చెలిమలు, కుంటలు ఎండిపోవడం, వన్యప్రాణుల దాహార్తి కోసం ఏర్పాటు చేసి సాసర్‌పిట్‌లలో నీటి సౌకర్యం కల్పించకపోవడంతో అటవి జంతువులు మూగ రోదనతో అలమటిస్తున్నాయి. అటవీ ప్రాంతాల్లో మూగ జీవాల కోసం ఏర్పాటు చేసిన సాసర్‌పిట్‌లను 'ఆంధ్రజ్యోతి' బృందం పరిశీలించగా పలు వాస్తవాలు వెలుగు చూశాయి.



లింగంపేట అటవీ ప్రాంతంలో నీరు లేక వృథాగా ఉన్న సాసర్‌పిట్



కల్వరాల్ అటవీ ప్రాంతంలో ఎండల తీవ్రతకు వట్టిపోయిన కుంటలు

అటవీ ప్రాంతంలో ఎండిపోతున్న చెరువులు, కుంటలు

కామారెడ్డి జిల్లా పరిధిలోని బాన్సువాడ, ఎల్లారెడ్డి, కామారెడ్డి, నాగిరెడ్డిపేట్, గాంధారి, సదాశివనగర్, మాచారెడ్డి, పిట్లం, జుక్కల్, తాడ్వాయి, లింగంపేట్, మద్నూర్ మండలాల్లో అటవీ ప్రాంతాలు అధికంగానే ఉన్నాయి. ఇలా జిల్లా వ్యాప్తంగా 2 లక్షల ఎకరాల్లో అటవీ ప్రాంతం విస్తరించి ఉంది. ఈ అడవుల్లో జింకలు, నెమళ్లు, కొండ గొర్రెలు, దుప్పిలు, ఎలుగుబంట్లు, అడవి పందులు, కోతులు, కుందేళ్లతో పాటు క్రూర మృగాలైన చిరుత పులులు ఉన్నట్లు అటవీశాఖ అధికారులు పేర్కొంటున్నారు. వేసవిలో ఈ అటవీ జంతువుల దాహార్తి కోసం అటవీ ప్రాంతంలో 300లకు పైగా సాసర్‌పిట్లు, 10 సోలార్ బోర్‌వెల్, 70 పార్క్యులేషన్ ట్యాంక్ ఉన్నట్లు అటవీశాఖ అధికారుల రికార్డులు చెబుతున్నాయి. ఈ వేసవిలో రోజురోజుకూ ఎండలు తీవ్రమవుతున్నాయి. అటవీ ప్రాంతంలో ఉన్న చెరువులు, కుంటలు సైతం ఎండకు అడుగంటి పోతున్నాయి. అడవిలోని పచ్చదనం ఎండిపోయింది. దీంతో అటవీ ప్రాంతంలోని వన్యప్రాణులకు నిండా నీడ కాదు కదా దప్పిక తీర్చుకోవడానికి గుక్కెడు నీరు కూడా దొరకని పరిస్థితి ఏర్పడుతోంది. దీంతో అటవీ ప్రాంతంలోని వన్యప్రాణులకు తాగునీటి ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

నీరులేక నిరుపయోగంగా సాసర్‌పిట్లు

ఎండ వేడిమికి జనాలే అలమటించిపోతున్నారు. ఇక అటవీ ప్రాంతంలోని మూగజీవాల పరిస్థితి మరింత దారుణంగా తయారవుతోంది. అభయారణ్యంలో ఉండే వన్యప్రాణులు నీటి కోసం తహతహలాడుతున్నాయి. ఎండలు తీవ్రంగా ఉన్నందున వన్యప్రాణుల కోసం అటవీ ప్రాంతంలో తాగునీటి సౌకర్యం కల్పించాల్సిన అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారంటూ జంతు ప్రేమికులు మండిపడుతున్నారు. అటవీ ప్రాంతంలో వేసవి కాలంలో వన్యప్రాణులకు తాగునీటి సమస్య తీర్చేందుకు అటవీ శాఖ అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు చేపడుతున్నామని చెబుతున్నప్పటికీ అవి ఎక్కడా కనిపి ంచడం లేదు. వేసవి వచ్చిందంటే అటవీ ప్రాంతంలో సాసర్ పిట్లను ఏర్పాటు చేసి వాటర్ ట్యాంకుల ద్వారానే వారానికి రెండు సార్లు నీటిని అందిం చాల్సి ఉంటుంది. ఈ నీటితో అటవీ ప్రాంతంలోని వన్యప్రాణులు వాటి దాహార్తిని తీర్చుకునేందుకు వీలుంటుంది. మూగ జీవాలకు దప్పికను తీర్చేందుకు అటవీ ప్రాంతంలో సాసర్‌పిట్లను ఏర్పాటు చేసినప్పటికీ నిరుపయోగంగానే కనిపిస్తున్నాయి. జిల్లాలోని బాన్సువాడ, ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట్, మాచారెడ్డి, గాంధారి, కామారెడ్డి, పిట్లం, జుక్కల్ అటవీశాఖ రెంజ్ పరిధిలు ఉన్నాయి. అయితే ఈ రెంజ్ పరిధిలోని కొంత మంది అధికారులు తమ పరిధిలోని అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన సాసర్‌పిట్లలో నీటిని నిల్వ ఉంచడంలో అలసత్వం ప్రదర్శిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. సిబ్బంది సాసర్‌పిట్లలో నీటిని వారంలో రెండు సార్లు నింపాల్సి ఉండగా కొంత మంది ట్యాంకర్ల ద్వారా కేవలం ఒకసారి మాత్రమే నింపి చేతులు దులుపుకుంటున్నారని ఆరోపణలు ఉన్నాయి. వర్షాకాలంలో వర్షాలు సమృద్ధిగా కురిసి అటవీ ప్రాంతాల్లో తినడానికి, తాగడానికి ఇబ్బందులు ఉండేవికావు. మండుతున్న ఎండలకు పూర్తిగా కుంటలు, చెరువులు ఎండిపోవడంతో నీటి కోసం వన్యప్రాణులు అలమటిస్తున్నాయి.

పట్టింపులేని సంబంధిత శాఖ

జిల్లాలోని అటవీ ప్రాంతంలో తాగునీటి కోసం వన్యప్రాణులు అలమట్టిస్తున్నా సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. అటవీ జంతువులు దాహార్తిని తీర్చేందుకు కొంత మంది సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. అడవుల్లో నీరు లేకపోవడంతో నిబంధనల ప్రకారం ఎండలు తీవ్రంగా ఉన్నప్పుడు సాసర్ పిట్లలో వాటర్ ట్యాంకుల ద్వారా మూడు లేదా నాలుగు సార్లు నీటిని నిల్వ చేసేందుకు చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. ఇందుకోసం ప్రభుత్వం ప్రత్యేక నిధులను కేటాయిస్తోంది. ఒకవేళ నిధులను కేటాయించకపోయినా సంబంధితశాఖ వారు వేరే నిధులు వెసులుబాటు చేసుకునే అవకాశం ఉంటుంది. కానీ అటవీశాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో అడవుల్లో నీరు దొరకక వన్యప్రాణులు మృత్యువాత పడుతున్నట్లు జంతు ప్రేమికులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధితశాఖ ఉన్నతాధికారులు స్పందించి అటవీ ప్రాంతంలో వన్యప్రాణుల దప్పిక తీర్చేందుకు నీటి సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలని జంతువు ప్రేమికులు కోరుతున్నారు.

నీటి కోసం జనావాసాల్లోకి వన్యప్రాణులు

జిల్లాలోని అటవీ ప్రాంతంలో చెరువులు, కుంటల్లో నీరు ఎండిపోవడంతో వన్యప్రాణులు నీటి కోసం జనావాసంలోకి వస్తున్నాయి. ప్రధానంగా అటవీ ప్రాంతంలోని జింకలు, నెమ ళ్లు, కోతులు, కొండ గొర్రెలు, కుందేళ్లు చుట్టు పక్కల్లోని గ్రామాల్లోకి, పంట పొలాల్లోకి వచ్చి దప్పికను తీర్చుకుంటున్నాయి. దీనిని అదునుగా భావిస్తున్న వేటగాళ్లు వీటిని వేటాడి చంపుతున్నారు. మరికొన్ని వన్యప్రాణులు చుట్టుపక్కల్లోని పంట పొలాల్లోకి నీరు తాగడానికి వస్తున్నాయి. సంబంధిత రైతులు పంట పొలాల్లో పంట రక్షణ కోసం పురుగుల మందు చల్లుతుండడంతో అక్కడ నీటిని తాగి వన్యప్రాణులు మృతి చెందిన సంఘటనలు అనేకంగా ఉన్నాయి. ఇలా అటవీ ప్రాంతంలోని వన్యప్రాణులు నీటి కోసం జనావాసంలోకి వచ్చి మృత్యువాత పడుతున్నాయి.

అటవీ జంతువుల కోసం నీటి సాకర్యం కల్పిస్తున్నాం

• నిఖిత, జిల్లా అటవీశాఖాధికారి

వేసవిని దృష్టిలో పెట్టుకుని జిల్లాలోని అటవీ ప్రాంతాల్లో జంతువుల కోసం తాగునీటి సౌకర్యాన్ని కల్పిస్తున్నాం. జిల్లాలో అటవీ ప్రాంతాల్లో సుమారు 300లకు పైగా సాసర్ పిట్లు ఏర్పాటు చేసి నీటిని అందుబాటులో ఉంచుతున్నాం.

నిజాంసాగర్ తాగునీటి విడుదలకు ప్రణాళిక సిద్ధం



నిజాంసాగర్ ప్రాజెక్టులో ప్రస్తుత నీటి మట్టం

- నిజాంసాగర్ నుంచి తాగునీటి కోసం 0.4 టీఎంసీల నీటి విడుదల
- యాసంగి సాగుకు 11.395 టీఎంసీల నీరు ప్రాజెక్టు నుంచి విడుదల
- నిజాంసాగర్ ఆయకట్టు కింద డిస్ట్రిబ్యూటర్ 1 నుంచి 49 వరకు లక్షా 35వేల ఎకరాలకు సాగునీరు

నిజాంసాగర్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఉభయ జిల్లాల వరప్రధాయిని అయిన నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి నిజామాబాద్ జిల్లా బోధన్ నిజామాబాద్ పట్టణాలకు నిజాంసాగర్ నుంచి తాగు నీటిని విడుదల చేసేందుకు అధికార యంత్రాంగం ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. నిజామాబాద్, బోధన్ పట్టణాల్లో నివాసముంటున్న దాదాపు ఐదు లక్షల జనాభాకు వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా ప్రతీ సంవత్సరం నిజాంసాగర్ నుంచి ఏప్రిల్, మే నెలల్లో తాగు నీటికి నీటిని విడుదల చేస్తూ ఉంటారు. ఈ ఏడాది ఎండలు ఎక్కువగా కాస్తూ ఉన్నప్పటికీ బోధన్, నిజామాబాద్ పట్టణాల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా బెల్లాల్ చెరువు, అలీసాగర్ రిజర్వాయర్లకు నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువ ద్వారా నిజామాబాద్, బోధన్ పట్టణాలకు తాగునీటి అవసరాలకు నీటిని విడుదల చేస్తూ ఉంటారు. బెల్లాల్ చెరువు, అలీసాగర్‌లకు నీటిని విడుదల చేసి ఈ రిజర్వాయర్‌లో నీటిని నిల్ల చేస్తూ ఉంటారు. బోధన్, నిజామాబాద్ పట్టణాలకు తాగునీటి అవసరాలను బట్టి ఈ రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేస్తూ ఉంటారు. ఈ ఏడాది నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి తాగునీటి కోసం 0.4 టీఎంసీల నీటిని విడుదల చేసేందుకు ఇప్పటికే నిజామాబాద్ జిల్లా అధికార యంత్రాంగం ప్రణాళిక రూపొందించారు. ఈ ప్రణాళిక కార్యరూపం దాల్చేందుకు ఇరిగేషన్ అధికారులతో జిల్లాల కలెక్టర్లు సమీక్ష జరపాల్సి ఉంటుంది. ఈ ఏడాది విపరీతంగా ఎండలు కాస్తూ ఉండడంతో బోరు బావుల్లో ఇప్పటికే భూగర్భ జలాలు తరిగిపో యాయి. మే మాసంలో నిజామాబాద్, బోధన్ పట్టణాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తే అవకాశం ఉంటుంది. ముందస్తుగానే నిజాంసాగర్ ప్రాజె క్టు నుంచి తాగు నీటిని విడుదల చేసేందుకు నీటి పారుదలశాఖ అధికారులు సమాయత్త మవుతున్నట్లు సమాచారం. ఈ ఏడాది వర్షాకా లంలో కురిసిన భారీ వర్షాలకు నిజాంసాగర్ జూలై, ఆగస్టు మాసాల్లోనే నిండిపోయింది. నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి వర్షాకాలానికి ఆయకట్టుకు ఎలాంటి నీటిని విడుదల చేయలేదు. యాసంగికి నిజాంసాగర్ ఆయకట్టు కింద 1,35,000 ఎకరాలకు సాగునీరు అందించేందుకు ప్రణాళిక రూపొందించారు. డిసెంబరు 2004 నుంచి 15 ఏప్రిల్ 2025 వరకు ఆరు విడతలుగా నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి 11.395 టీఎంసీల నీటిని విడుదల చేశారు. డిస్ట్రిబ్యూటర్ 1 నుంచి 49 వరకు ఉన్న లక్షా 35,000 ఎకరాలకు యాసంగికి సాగునీరు అందించారు. యాసంగిలో ఆయకట్టు కింద రైతాంగం సిరులు పండించుకున్నారు. ఏడాది వర్షాకాలం కూడా నిజాంసాగర్ ప్రాజెక్టు కింద ఉన్న ఆయకట్టుకు ఢోకా లేదని రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. నిజాంసాగర్ ప్రాజెక్టు పూర్తి నీటి సామర్థ్యం 1405.00 అడుగుల గాను 1393.50 అడుగుల నీటి సామర్థ్యం కలిగి ఉంది. ప్రస్తు తం నిజాంసాగర్ ప్రాజెక్టులో 5.856 టీఎంసీల నీరు నిల్వ ఉంది. నిజామాబాద్, బోధన్ పట్టణాలకు నిల్వ ఉన్న నీటిలో నుంచి 0.4 టీఎంసీల నీటిని విడుదల చేస్తారు. నిజాంసాగర్ ప్రాజెక్టులో 5.400 టీఎంసీల నీటి నిల్వలు ఉంటాయి. వర్షాకాలంలో కురిసే వర్షాలకు ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు వచ్చి చేరే అవకాశం ఉం టుందని రైతులు భావిస్తుంటారు. ఏది ఏమైనప్పటికీ నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి వర్షాకాలం సాగు నీటికి ఢోకా లేదు. దీంతో ఆయకట్టు రైతుల ఆశలు చిగురుస్తూనే ఉన్నాయి.

విడతల వారీగా గన్నీ బ్యాగులు అందిస్తాం



కొనుగోలు కేంద్రంలో జొన్నలను పరిశీలిస్తున్న మార్క్‌ఫెడ్ డీఎం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పెద్ద కొడప్‌గల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): పెద్దకొడప్‌గల్ సహకార సంఘ పరిధిలో ఏర్పాటు చేసిన జొన్న కొనుగోలు కేంద్రంలో 'జొన్న రైతులకు గన్నీ బ్యాగుల కొరత' అనే శీర్షిక 'ఆంధ్రజ్యోతి'లో మంగళవారం కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి స్పందించిన జిల్లా మార్క్‌ఫెడ్ డీఎం మహేష్ కుమార్ జొన్న కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ పెద్ద కొడప్‌గల్ కొనుగోలు కేంద్రానికి రెండు దఫాలుగా సుమారు 50 వేల గన్నీ బస్తాలు అందించడం జరిగిందని, ఈ గన్నీ బస్తాలు జొన్నలతో తిరిగి వస్తేనే మళ్లీ గన్నీ బ్యాగులు పంపడానికి వీలవుతుందని తెలిపారు. అయితే ఈ సహకార సంఘ రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని విడతల వారీగా గన్నీ బ్యాగులు సరఫరా చేస్తామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఎక్కడా గన్నీ బ్యాగుల కొరతలేదని అన్ని సెంటర్లలో గన్నీ బ్యాగులు అందుబాటులలో ఉన్నాయన్నారు. జిల్లా వ్యాప్తంగా 1132 మంది రైతన్నలు జొన్నలను పండించారని వీరి నుంచి 20 కొనుగోలు కేంద్రాల ద్వారా జొన్నలను కొనుగోలు చేస్తున్నామన్నారు. ఈ సంవత్సరం జిల్లా వ్యాప్తంగా 71 వేల ఎకరాల్లో జొన్న పంటను రైతులు సాగు చేశారని, ఇప్పటి వరకు 3 వేల టన్నుల జొన్నలు కొనుగోలు చేయడం జరిగిందన్నారు. కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన జొన్నలను లారీల కొరత లేకుండా వెంటనే గోదాంలకు తరలించడం జరుగతుందని తెలిపారు. ఇప్పటి వరకు కొనుగోలు చేసిన జొన్నలకు రైతుల ఖాతాల్లో నాలుగు రోజుల్లో డబ్బులు జమ చేస్తామన్నారు. ప్రభుత్వం కొనుగోలు ద్వారా జొన్నకు మద్దతు ధర 3371 ప్రకటించినందున రైతులు జొన్నలను చెన్నీ పట్టి, ఎలాంటి చెత్తా చెదారం లేకుండా తీసుకురావాలని సూచించారు. జొన్న కొనగోలు కేంద్రాలు ప్రారంభించిన నాటి నుంచి 90 రోజుల వరకు జొన్నలను తూకం వేయడం జరుగుతుందని, రైతులు తొందరపాటుకు గురికావద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో సహ కార సంఘ సీఈవో సందీప్, సిబ్బంది సంజీవ్, రైతులు పాల్గొన్నారు.

పేద రైతుల కోసమే భూ భారతి



షట్పల్లిలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

- 9 నెలలు మేథోమదనం చేసి భూ భారతి చట్టాన్ని రూపొందించాం
- భూ సమస్యలు ఎక్కువగా ఉన్నందునే పైలెట్ ప్రాజెక్ట్ కింద లింగంపేట
- పది రోజుల్లో 10,956 మంది గ్రామ రెవెన్యూ అధికారులను నియమిస్తాం
- మే 4 వరకు అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు
- లింగంపేట రెవెన్యూ సదస్సులో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

కామారెడ్డి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి)/లింగంపేట : దరణితో భూ సమస్యలు పరిష్కారం కాకపోవడంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి పర్యవేక్షణలో భూ భారతి కొత్త చట్టం కోసం 9 నెలలుగా మేథోమదనం చేసి రూపొందించి అసెంబ్లీలో ప్రవేశపెట్టామని, అంబేద్కర్ స్ఫూర్తితో రోల్‌మోడల్‌గా ఉండేలా చట్టాన్ని రూపొందించామని, పేద రైతుల కోసమే కాంగ్రెస్ భూ భారతి చట్టాన్ని తీసుకువచ్చామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఈ చట్టాన్ని అమలులోకి తీసుకువచ్చి నాలుగు జిల్లాలో పలు మండలాలను పైలెట్ ప్రాజెక్ట్‌లుగా ఎంపిక చేసి అమలు చేస్తున్నామన్నారు. ఇలా పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంపికైన లింగంపేట మండలంలోని 20 గ్రామాల్లో సదస్సులు నిర్వహించగా రైతుల నుంచి 3,400ల దరఖాస్తులు వచ్చాయని అన్నారు. వీటన్నింటిని త్వరలోనే పరిష్కరిస్తామని అన్నారు. భూ భారతికి పైలెట్ ప్రాజెక్ట్ కింద ఎంపికైన లింగంపేట మండలంలోని షెట్పల్లిలో అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ అవగాహన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హాజరై రైతులకు భూ భారతి చట్టంపై అవగాహన కల్పించారు. అంతకుముందు ప్రత్యేక హెలీప్యాడ్‌లో హైదరాబాద్ నుంచి లింగంపేట మండలం మోతె గ్రామానికి చేరుకున్నారు. అక్కడ స్థానిక ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు, కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్, ఎస్పీ రాజేష్ చంద్రలు స్వాగతం పలికారు. అనంతరం సదస్సులో మంత్రి మాట్లాడుతూ రైతుల భూ సమస్యలను పరిష్కరించేందుకు జూన్ 2 నుంచి ఆగస్టు 15 వరకు రాష్ట్ర వ్యాప్తంగా రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తామని భూ సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని అమలులోకి తీసుకువచ్చిందని అన్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా నాలుగు మండలాలు పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక

ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా నాలుగు మండలాలను పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసి ఆయా గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తూ భూ సమస్యలు ఉన్న రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. వీటిని త్వరలోనే పరిష్కరించి పైలెట్ ప్రాజెక్ట్ మండలాల మాదిరిగానే రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ సదస్సులు నిర్వహించి భూ సమస్యలే లేకుండా చేయడమే భూ భారతి లక్ష్యమని అన్నారు. వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ సమయంలో పట్టా పాస్ బుక్‌లలో భూముల లోకేషన్ కోసం మ్యాప్‌ను పొందుపరుస్తామని అన్నారు. తరతరాలుగా ప్రభుత్వ భూముల్లో సాగు చేసుకుంటూ పట్టాలు అందక పథకాలకు చాలా మంది రైతులు దూరమవుతున్నారని వారందరికి త్వరలోనే పట్టాలు అందజేస్తామని మంత్రి అన్నారు. గత బీఆర్ఎస్ (మిగతా 8వ పేజీలో)

భూ భారతితోనే రైతులకు మేలు

• కలెక్టర్ సంగ్వాన్



డోంగ్లీలో మాట్లాడుతున్న కలెక్టర్

మద్నూర్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : భూ భారతితోనే రైతులకు మేలు జరుగుతుందని కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ అన్నారు. తెలంగాణ ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రతిష్ఠాత్మకంగా భూ భారతి చట్టాన్ని అమలు చేస్తుందని గుర్తు చేశారు. మంగళవారం మద్నూర్, డోంగ్లీ మండలాల్లో రైతులకు భూ భారతి చట్టంపై అవగాహన కల్పించారు. రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను పూర్తిగా పరిష్కరించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం నూతనంగా భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చిందని తెలిపారు. భూ భారతి చట్టం సెక్షన్ 4 ప్రకారం హక్కుల రికార్డుల్లో తప్పుల సవరణకు భూమి హక్కులు ఉండి రికార్డుల్లో లేనివారు హక్కుల రికార్డుల నమోదు చేయించుకోవడానికి కొత్త చట్టం ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. రెవెన్యూ డివిజన్ అధికారి జిల్లా కలెక్టర్లు ఈ దరఖాస్తులను పరిశీలించి నిర్ణయం తీసుకుం టారని తెలిపారు. వీరు తీసుకున్న నిర్ణయంపై అభ్యంతరాలు ఉంటే జిల్లా కలెక్టర్ భూమి ట్రిబ్యునల్‌కు అప్పీలు దాఖలు చేసుకోవచ్చని సూచించారు. బలహీన వర్గాల కోసం ప్రభుత్వం అడ్వకేటును నియమించినట్లు తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో బలహీన వర్గాల కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా అడ్వకేటును నియమించినట్లు తెలిపారు. సెక్షన్ 5 ప్రకారం కొనుగోలు, దానం, తనఖా బదిలీ, పంప కాల ద్వారా భూమిపై హక్కులు సంక్రమి స్తే తహసీల్దార్

(మిగతా 8వ పేజీలో)

ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలి



ఎమ్మెల్యే, కలెక్టర్ పత్రాలను అందజేస్తున్న దృశ్యం

బోధన్‌రూరల్,ఏప్రిల్29(ఆంధ్రజ్యోతి):బోధన్ లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయమని, ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు లయన్స్‌క్లబ్ ఎదురుగా ఉన్నమున్సిపల్ కాంప్లెక్స్‌లో జనరల్ ఆసుపత్రి కోసం లయన్స్‌క్లబ్‌కు కేటాయిస్తున్నట్లు బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి పత్రాలను లయన్స్ ప్రతినిధులు నాగేశ్వర్‌రావు, ప్రతాప్ గుప్తాకు కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మరింత మెరుగైనసేవలు అందించాలన్నారు.లయన్స్ లాగానే ఆసుపత్రికూడా మంచి పేరు సాధించాలన్నారు.లయన్స్ క్లబ్ చేస్తున్న సేవలను కొనియాడారు.

ఖాజాపూర్‌లో అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ



అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ చేస్తున్న బైరి నరేష్

బోధన్‌రూరల్,ఏప్రిల్29(ఆంధ్రజ్యోతి): సాలూర మండలంలోని ఖాజాపూర్ గ్రామంలో అంబేద్కర్ విగ్రహాన్ని మంగళవారం బైరి నరేష్ ఆవిష్కరించారు. బైరి నరేష్ గ్రామానికి చేరుకునే ముందు కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పాత కేసుల విషయమై పోలీసులు బైరి నరేష్‌కు నోటీసులు ఇచ్చారు. సభలో ఎలాంటి అసభ్యకర వ్యాఖ్యలు చేయవద్దని సూచించారు. అనంతరం గ్రామస్థులతో కలిసి ఖాజాపూర్ గ్రామంలో అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

జన్నేపల్లి బంద్ ప్రశాంతం



జన్నేపల్లిలో ఉగ్రవాదులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న నాయకులు

నవీపేట,ఏప్రిల్29(ఆంధ్రజ్యోతి): మండలంలోని జన్నేపల్లి బంద్ మంగళవారం ప్రశాంతంగా జరిగింది. ఇటీవల జమ్మూకాశ్మీర్‌లోని పహల్గాంలో అమాయకులైన 28మందిని ఉగ్రవాదులు కాల్చి చంపడం పట్ల నిరసిస్తూ ఈ బంద్ పాటించారు. ఈ సందర్భంగా హిందు సంఘాల ఆధ్వర్యంలో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అమాయకులపై దాడులు జరిపిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు.

మేడేను జయప్రదం చేయాలి

కోటగిరి,ఏప్రిల్29(ఆంధ్రజ్యోతి): మేడేను జయప్రదం చేయాలని సీపీఐ బాన్సువాడ నియోజకవర్గ నాయకులు దుబాస్ రాములు పేర్కొన్నారు. కోటగిరి మండల కేంద్రంలోని శ్రీ నలంద పాఠశాలలో మంగళవారం మేడే వాల్‌పోస్టర్లను సీపీఐ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమానమైన పనికి సమానమైన వేతనం ఇవ్వాలని, మనుషులు యంత్రాలు కాదు నిరంతరం పని చేయరు అని చెప్పి కార్మికుల హక్కుల కోసం పోరాడి రక్తం చిందించింది మే 1వ తేది అని పేర్కొన్నారు. రక్తంతో తయారు చేసిన ఎర్రజెండాను కార్మికులు ఎగురవేసి పండుగలా జరుపుకుంటారని ఆయన పేర్కొన్నారు. మేడే ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు విఠల్ గౌడ్, గంగాధర్, సాయిలు, శివ తదితరులు పాల్గొన్నారు.

ఒకరికి ఒకరోజు జైలుశిక్ష

రెంజల్,ఏప్రిల్29(ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి అర్ధరాత్రి సమయంలో డయల్ 100కు ఫోన్ చేసి న్యూసెన్స్ సృష్టించిన నీలా గ్రామానికి చెందిన మహమ్మద్ అనే వ్యక్తికి సెకండ్ క్లాస్ న్యాయాధికారి శేషతల్ప సాయి ఒకరోజు జైలుశిక్ష విధిస్తూ తీర్పు వెలువరించినట్లు ఎస్ఐ చంద్రమోహన్ అన్నారు. ఎవరైనా మద్యం సేవించి అర్ధరాత్రి సమయంలో డయల్ 100, 108కు కాల్ చేసి న్యూసెన్స్ చేస్తే చట్టపరంగాచర్యలు చేపట్టడం జరుగుతుందని ఎస్సై తెలిపారు.

దూపల్లిలో పోలీసుల కళాప్రదర్శన

రెంజల్,ఏప్రిల్29(ఆంధ్రజ్యోతి): మండలంలోని దూపల్లి గ్రామంలో పోలీసుల కళాబృందం చేత ఎస్ఐ చంద్రమోహన్ ఆధ్వర్యంలో పోలీసు కళాబృందాన్ని ఏర్పాటు చేశారు. గ్రామంలో మూఢనమ్మకాలతో పాటు డ్రంక్ అండ్ డ్రైవ్, యువత దుర్ అలవాట్లకు పాల్పడకుండా సన్మార్గంలో నడవాలని, గ్రామంలో శాంతిభద్రతకు విఘాతం కలగకుండా చూడాలని ఎస్ఐ పేర్కొన్నారు. యువత చెడు దారిలో కాకుండా సన్మార్గంలో నడవాలని ఎస్ఐ సూచించారు. ప్రతి గ్రామంలో సీసీ కెమెరాను ఏర్పాటు చేసుకోవాలని పేర్కొన్నారు. ఏమైన సమస్యలు తలెత్తితే పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ బాబన్న, కానిస్టేబుళ్లు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

హంగర్గలో చోరీ

● బంగారు నగలతో పాటు బైక్ అపహరణ

కోటగిరి,ఏప్రిల్29(ఆంధ్రజ్యోతి): పొతంగల్ మండలంలోని హంగర్గ గ్రామంలో షట్టి శ్రీకాంత్ ఇంట్లో సోమవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళం పగులగొట్టి లోనికి చొరబడి బంగారు, వెండి ఆభరణాలతో పాటు ద్విచక్ర వాహనాన్ని ఎత్తుకెళ్లారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం శ్రీకాంత్ కుటుంబ సభ్యులు వేసవికాలం కావడంతో ఇంటికి తాళం వేసి దాబాపైకి వెళ్లి పడుకున్నారు. అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లో చొరబడి బీరువాలో ఉన్న బంగారు, వెండి ఆభరణాలతో పాటు ఆరుబయట ఉన్న ద్విచక్ర వాహనాన్ని ఎత్తుకెళ్లారు. శ్రీకాంత్ కుటుంబ సభ్యులు తెల్లవారగానే లేచి కిందికి వచ్చారు. ఇంటి తలుపులు తెరిచి ఉండడంతో ఆందోళనకు గురయ్యారు. ఇంట్లో వస్తువులు చిందరవందరగా ఉండగా బీరువా పగులగొట్టి ఉండడంతో బాధితులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలాన్ని కోటగిరి ఎస్ఐ సునీల్ పరిశీలించి వివరాలు సేకరించారు. బాధితుడి అన్న లక్ష్మణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



బీరువాను ధ్వంసం చేసిన దృశ్యం

అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అందించడమే ప్రభుత్వ లక్ష్యం

● రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి



జక్రాన్‌పల్లిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న రూరల్ ఎమ్మెల్యే

జక్రాన్‌పల్లి, ఏప్రిల్29 (ఆంధ్రజ్యోతి):ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకోసం సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అర్హులైనవారందరికి అందించడమే ప్రభుత్వ లక్ష్యమని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని జక్రాన్‌పల్లి, కొలిప్యాక్, తొర్లికొండ, బ్రాహ్మన్‌పల్లి గ్రామాలలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూపతిరెడ్డి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే భూపతిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం వచ్చాక ఏడాదిన్నరలో జక్రాన్‌పల్లి మండలంలో రూ. 30 కోట్ల తో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. మొదటి విడతలో అర్హులైన వారందరికి ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇస్తామన్నారు. రెండవ విడతల ఇళ్ల స్థలాలు లేనివారిని గుర్తించి ఇండ్ల స్థలాలు ఇచ్చి ఇందిరమ్మ ఇండ్లను నిర్మించి ఇస్తామన్నారు. మొదటి విడతలో జక్రాన్‌పల్లి గ్రామానికి 80 ఇండ్లు మంజూరు చేశామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాటప్రకారం రేషన్ ద్వారా సన్నబియ్యం ఒక్కొక్కరికి ఆరు కిలోల చొప్పున ఇస్తున్నామన్నారు. ప్రజలు సంతోషంగా సన్నబియ్యం వండుకుని మూడుపూటలు భోజనం చేస్తున్నారన్నారు. రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి నెలలోగా రేషన్ కార్డులను అందజేస్తామన్నారు. మహిళలను కోటీశ్వరులను చేయడమే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లక్ష్యమని అన్నారు. మహిళలకు లక్షకోట్లు వడ్డీలేని రుణాలు ఇస్తున్నామన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో రానున్న ఐదేళ్లలో నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని అన్ని మండలాల లో అభివృద్ధి పనులు చేస్తామన్నారు. అభివృద్ధి విషయంలో రూరల్ నియోజకవర్గం పరుగులు పెడుతుందన్నారు. రైతులను రాజును చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. రైతులు ఆందోళన చెందడం అవసరం లేదని ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రతీ గింజను కొనుగోలు చేస్తామన్నారు. దేశంలో 15 రాష్ట్రాలలో బీజేపీ పాలిస్తుందని ఆ పదిహేను రాష్ట్రాలలో తెలంగాణలో అమలు చేస్తున్న పథకాలను ఆ రాష్ట్రాల్లో ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. గడిచిన పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పటి మాజీ సీఎం కేసీఆర్ చేసిన అప్పులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వడ్డీ, అసలు కడుతూ అప్పులు తీరుస్తున్నారన్నారు. పార్లమెంట్‌లో కేంద్రం యాభైలక్షల కోట్లు బడ్జెట్ ప్రవేశపెట్టగా తెలంగాణ రాష్ట్రానికి ఇచ్చిన నిధులు ఏమిలేవన్నారు. రానున్న ఐదేళ్లలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయక్వంలో అధిక నిధులను తెచ్చి నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు నిధులను కేటాయించి అన్ని విధాల అభివృద్ధి చేసి తీరుతామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఐడీసీ చైర్మన్ ఎం. సాయిరెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చిన్నారెడ్డి, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి వసంత్‌రావు, రూరల్ నియోజకవర్గ కాంగ్రెస్ యూత్ ఉపాధ్యక్షుడు సొప్పరి వినోద్, సింగిల్‌విండో చైర్మన్‌లు ఆర్మూర్ గంగారెడ్డి, కాటిపల్లి నర్సారెడ్డి, నాగుల శ్రీనివాస్, ఆర్మూర్ మార్కెట్ కమిటి డైరెక్టర్ కనకరవి, మాజీ సర్పంచ్‌లు కాటిపల్లి నర్సారెడ్డి, ఎం. సాయిరెడ్డి, శేఖర్, మాజీ ఎంపీటీసీలు మద్దుల రమేష్, రూపాల గంగారెడ్డి, కొలిప్యాక్ మాజీ సింగిల్‌విండో చైర్మన్ మామిడి భాస్కర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

ఏయిర్‌పోర్టు ఏర్పాటుకు తమ విలువైన పట్టాభూములను ఇచ్చేది లేదని వినతి

జక్రాన్‌పల్లి: జక్రాన్‌పల్లిలో ఏర్పాటు కానున్న ఏయిర్‌పోర్టు నిర్మానానికి తమ విలువైన పట్టాభూములను ఇచ్చేది లేదని ఏయిర్‌పోర్టు భూబాధిత రైతులు తేల్చిచెప్పారు.మంగళవారం జక్రాన్‌పల్లి మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొనడానికి వచ్చిన నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డిని జక్రాన్‌పల్లి, మనోహరబాద్, కొలిప్యాక్, తొర్లికొండ, అర్గుల్ గ్రామాలకు చెందిన ఏయిర్‌పోర్టు భూబాధిత రైతులు ఎమ్మెల్యేను కలిశారు. అనంతరం తమ విలువైన పట్టా భూములను ఇచ్చేది లేదని ఈ విలువైన భూములను ఏయిర్‌పోర్టుకు ఇస్తే ఉపాధి కరువై రైతు కుటుంబాలు రోడ్డున పడతాయని ఈ విలువైన రైతుల పట్టాభూములను ఏయిర్‌పోర్టుకు ఇచ్చేది లేదని భూబాధిత రైతులు స్పష్టం చేశారు. ఈ ఏయిర్‌పోర్టు భూబాధితులు ఇచ్చిన వినతిపత్రాన్ని ఎమ్మెల్యేకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి మాట్లాడుతూ ఏయిర్‌పోర్టు ఏర్పాటు కోసం 16 వందల ఎకరాల భూమి అవసరం ఉందని ప్రభుత్వం, ఏయిర్‌పోర్టు అథారిటి ఆఫ్ ఇండియా బృందం అధికారులు ప్రభుత్వానికి తెలిపారని ఇందులో జక్రాన్‌పల్లి, మనోహరబాద్, కొలిప్యాక్, తొర్లికొండ, అర్గుల్ గ్రామాలలో కలిపి 800 ఎకరాల రైతుల పట్టాభూమి పోతుందని తేలిందన్నారు. ఏయిర్‌పోర్టు భూబాధిత రైతుల విన్నపం మేరకు ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని ఎమ్మెల్యే భూబాధిత రైతులకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఐదు గ్రామాల ఏయిర్‌పోర్టు భూబాధిత రైతులు పాల్గొన్నారు.

చదువుకున్న ప్రతీ ఒక్కరు గ్రంథాలయాన్ని ఉపయోగించుకోవాలి

● రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి



పచ్చలనడుక్కడలో గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న అన్వేష్‌రెడ్డి

వేల్పూర్,ఏప్రిల్29(ఆంధ్రజ్యోతి):చదువుకున్న ప్రతీఒక్కరు ప్రతీరోజు గ్రంథాలయాన్ని ఉపయోగించుకోవాలని రాష్ట్ర విత్తనాభివృద్ధి చైర్మన్ అన్వేష్‌రెడ్డి సూచించారు. జేడీ ఫౌండేషన్ వారి గ్రంథాలయ ఉద్యమంలో భాగంగా వేల్పూర్ మండలం పచ్చలనడుక్కడ గ్రామంలో ఏర్పాటు చేసిన కాళోజీ గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతిరెడ్డి రాజారెడ్డి జేడీ ఫౌండేషన్ తెలంగాణ కన్వీనర్ పింగిలి కవితారెడ్డి లతో కలిసి రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని చదువుకున్న యువతి యువకులు గ్రంథాలయాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకొని వివిధ విషయాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. గ్రామస్థుల సహకారంతో ఈ గ్రంథాలయాన్ని నడుపుకోవాలని జేడీ ఫౌండేషన్ వారి ఉన్నత ఆశయాన్ని కొనియాడారు. గ్రామంలో చదువుకున్న యువకుల భవిష్యత్తు కోసం గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయాలని అందుకు మీ సహకారం కావాలని జేడీ ఫౌండేషన్ జేడీలక్ష్మీనారాయణ, ఆఫౌండేషన్ తెలంగాణ కన్వీనర్ కవితారెడ్డిలను అడగగానే గ్రంథాలయం ఏర్పాటుకు ఆర్థిక సహాయం అందిం చిన వారికి గ్రామ ప్రజల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రతీ వ్యక్తికి జ్ఞానం ముఖ్యమని జ్ఞానాన్ని మించిన ఆస్తి లేదన్నారు. సెల్‌ఫోన్ వచ్చిన తర్వాత పుస్తకం దూరం అవుతుందన్నారు. పుస్తకాలు ఎంత చదివితే అంత జ్ఞానం వస్తుందన్నారు. చదువుకుంటున్న పిల్లల కోసం పోటీ పరీక్షలకు, చరిత్రకు సంబంధించిన పుస్తకాలన్ని ఈ గ్రంథాలయంలో అందుబాటులో ఉన్నాయన్నారు. గ్రామ ప్రజలకు ఉపయోగపడే ప్రతీ పనిలో ఈ గ్రామవాసిగా ఈ గ్రామంలో పుట్టినందుకు తప్పకుండ ముందుంటానని అన్వేష్‌రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గుడాల మోహన్, టక్కారి గంగాధర్, గట్టవతల నర్సారెడ్డి, సచిన్, కృపాల్, నెహ్రూ, ముత్తెన్న, అలీముద్దిన్, గంగారెడ్డి, రాజేంధర్, బోజన్న, నర్సయ్య, మోహన్, లింగేశ్వర్, విడిసి సభ్యులు, యువతి యువకులు పాల్గొన్నారు.

ఉగ్రవాదుల దాడులకు వ్యతిరేకంగా పోరాడాలి : సీపీఎం

బోధన్‌రూరల్,ఏప్రిల్29(ఆంధ్రజ్యోతి): దేశ ప్రజలందరు సమైక్యంగా ఉగ్రవాదుల దాడులకు వ్యతిరేకంగా పోరాడాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్ బాబు అన్నారు. మంగళవారం బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపైన విచక్షణ రహితంగా కాల్పులు జరిపి 28మందిని పొట్టన పెట్టుకున్నారని ఉగ్రవాదులకు మతాలు, కులాలు ఏవీ పనికి రావని, దేశంలో అల్లకల్లోలం సృష్టించడం ద్వారా ప్రజల్లో విద్వేషాలను రెచ్చగొట్టి అశాంతిని కలిగించడమే వారి ముఖ్య ఉద్దేశం అన్నారు. ఉగ్రవాదాన్ని అరికట్టడంలో కేంద్ర ప్రభుత్వం, ఇంటెలిజెన్స్ విభాగం భద్రత దళాలు ముందుగా పసిగట్టక మూలంగానే ఉ గ్రవాదులు చొరబడ్డారని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం కుల, మతాల వ్యత్యాసాలను సృష్టించడానికి తద్వారా ప్రజల్లో విద్వేషాలను పెంచి రాజకీయ లబ్ది పొందడానికి తన తప్పిదాలను కప్పిపుచ్చుకోవడానికి ప్రయత్నిస్తుందన్నారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా దేశ పౌరులందరు ఐక్యంగా తిప్పి కొట్టాలని అప్పుడు ఉగ్రవాదాన్ని అరికట్టవచ్చన్నారు. ఈకార్యక్రమంలో సీపీఎం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు నూర్జహన్, శంకర్ గౌడ్, నన్నేసాబ్, గంగాధరప్ప, మల్లేష్, గంగాధర్, పోశెట్టి, కుమారస్వామి, గోపి తదితరులున్నారు.



ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేస్తున్న దృశ్యం

కార్మికులకు ఓఆర్ఎస్ ప్యాకెట్ల అందజేత

భీమ్‌గల్ , ఏప్రిల్29 (ఆంధ్రజ్యోతి):భీమ్‌గల్ మున్సిపాలిటీ కార్యాలయంలో పని చేస్తున్న కార్మికులకు మున్సిపల్ కమీషనర్ గోపు గంగాధర్, పిహెచ్‌సీ డాక్టర్ అజయ్ పవర్‌లు మంగళవారం ఓఆర్ఎస్ ప్యాకేట్లను అందజేశారు. అంతకు ముందు ప్రతీ కార్మికుడికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వేసవికాలం దృష్ట్యా ప్రతి కార్మికుడు ఎండవేడి నుంచ ఉపశమనం పొందేందుకు ఓఆర్ఎస్ ప్యాకేట్లను క్రమం తప్పకుండా నీటిలో కలుపుకొని తాగాలని డాక్టర్ కార్మికులకు సూచించారు. వడదెబ్బ నివారణకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.

నేడు భూభారతి చట్టంపై అవగాహన సదస్సు

నవీపేట,ఏప్రిల్29(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా అమలు చేసిన కొత్త ఆర్ఓఆర్ చట్టం-2025 భూభారతి గురించి బుధవారం మండల కేంద్రంలో అవగాహన సదస్సును ఏర్పాటు చేయడం జరిగిందని తహసీల్దార్ వెంకట రమణ తెలిపారు. ఉదయం 10గంటలకు స్థానిక రైతు వేదికలో ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమానికి బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, అడిషనల్ కలెక్టర్ కిరణ్ కుమార్, నిజామాబాద్ ఇన్‌చార్జి ఆర్డీవోలు హాజరుకానున్నారని తెలిపారు.

వడదెబ్బతో మహిళ మృతి

వర్ని,ఏప్రిల్29(ఆంధ్రజ్యోతి): వడదెబ్బతో మహిళ మృతి చెందిన సంఘటన మంగళవారం వర్ని మండలం జలాల్‌పూర్ గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన ఏసిక అర్చన(53) బడాపహాడ్‌లో కూలీ పనులు చేసుకుని జీవనం కొనసాగిస్తోంది. సోమవారం ఎండలో పనికి వెళ్లే యత్నంలో వడదెబ్బకు గురైంది. దీంతో కుటుంబ సభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం నిజామాబాద్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. మృతురాలికి భర్త, కూతురు, కుమారుడు ఉన్నారు. కూలీ పనులు చేస్తే తప్ప వీరికి పూట గడవదు. ప్రభుత్వం బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అదృశ్యమైన వ్యక్తి చెరువులో శవమై తేలాడు..

కమ్మర్‌పల్లి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి):కమ్మర్‌పల్లి మండలకేంద్రంలోని గాంధీనగర్ వడ్డరకాలనికి చెందిన వేముల పోశెట్టి (55) గత రెండురోజుల క్రితం అదృశ్యమై కాలనీ సమీపంలోని గుండ్ల కుంట చెరువులో మంగళవారం శవమై తేలినట్లు ఎస్సై అనిల్ రెడ్డి తెలిపారు. ఈ నెల 27 న సాయంత్రం ఇంటినుంచి బయలుదేరిని పోశెట్టి ఇంటికి తిరిగిరాకపోవడంతో కుటుంబ సభ్యులు బంధువులను ఆరాతీశారు. ఈ విషయమై పోశెట్టి కూతురు వేముల గంగామణి స్థానిక పోలీసులకు తన తండ్రి కనిపించడంలేదని 28 న ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసునమోదు చేశామన్నారు. గాలింపు చర్యల్లో భాగంగా కాలనీసమీపంలోని గుండ్ల కుంట చెరువు గట్టుపై పోశెట్టికి సంబంధించిన బట్టలు, ఇతర వస్తువులు గుర్తించారు. కాగా.. మంగళవారం ఉదయం చెరువులో శవమైతేలినట్లు తెలిపారు. శవపంచినామా అనంతరం శవాన్ని పోస్టుమార్టం కోసం తరలించి కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నేడు నవీపేటలో జగన్నాథ శోభాయాత్ర

నవీపేట,ఏప్రిల్29(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బుధవారం శ్రీ జగన్నాథ శోభాయాత్ర మహోత్సవం నిర్వహించడం జరుగుతుందని నిర్వాహకులు అల్లి ప్రవీణ్, సీహెచ్ లోకేష్‌లు తెలిపారు. లోక కల్యాణార్థం చేపట్టిన ఈ జగన్నాథ శోభాయాత్రను మధ్యాహ్నం 4గంటలకు స్థానిక భక్త మార్కండేయ ఆలయం నుండి ప్రారంభమై రాత్రి 9గంటల వరకు మండల కేంద్రంలోని పుర వీధులలో నిర్వహించడం జరుగుతుందని వారు వివరించారు. ఈ సందర్భంగా భజనలు, సంకీర్తనలు, సాంస్కృతిక కార్యక్రమాలు, మహ హారతి, ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని వారు వివరించారు.

కనీస పింఛన్ సాధన కోసం పోరాడుదాం

బోధన్‌రూరల్,ఏప్రిల్29(ఆంధ్రజ్యోతి): కనీస పింఛన్ సాధనకై పోరాడుదామని టీయూసీఐ రాష్ట్ర నాయకులు మల్లేష్ అన్నారు. మంగళవారం కరపత్రాలను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పని గంటల పెంపుదలను కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను తిప్పి కొడుతూ విధివిధానాలు, కనీస పింఛన్‌ల సాధనకై పోరాడుదామన్నారు. ఎన్ఎంఆర్ కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. మే 1వ తేదిన జరిగే మే డే దినోత్సవాన్ని పనిగంటల పెంపుదలను, కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను తిప్పి కొట్టాలన్నారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జ్ఞానేశ్వర్, గంగాధర్, రాజు, లక్ష్మి, మసీద్, పోశెట్టి, వాహబ్, గణేష్ పాల్గొన్నారు.

మహనీయుల జయంతిని విజయవంతం చేయాలి

బోధన్‌రూరల్,ఏప్రిల్29(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలో ఈ నెల 30వ తేదిన నిర్వహించనున్న మహనీయుల జయంతిని విజయవంతం చేయాలని ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ సంఘం రాష్ట్ర నాయకులు పరిమి కోటేశ్వర్ రావు, బోధన్ కన్వీనర్ నీరడి ఈశ్వర్ అన్నారు .ఈ సమావేశంలో నీరడి రవికుమార్, సింగాడే పాండు, కొండ్ర వెంకటి, కారం స్వామి, దేవేందర్, సురేందర్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

సిద్ధాపూర్‌లో ఇసుక టిప్పర్లు ఆపి కూలీల నిరసన

బోధన్‌రూరల్,ఏప్రిల్29(ఆంధ్రజ్యోతి): బోధన్ మండలంలోని సిద్ధాపూర్ ఇసుక క్వారీ వద్ద కూలీలు ఇసుక టిప్పర్లను ఆపి మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. సిద్ధాపూర్ క్వారీ నుంచి అధికారికంగా వారంలో మూడు రోజులు ట్రాక్టర్ల ద్వారా ఇసుక తీయడానికి అధికారులు పర్మిషన్ ఇస్తున్నారన్నారు. ట్రాక్టర్‌లకు కాకుండా టిప్పర్‌లకు పర్మిషన్ ఇవ్వడంతో లేబర్లుగా పని చేసే వారికి ఉపాధి లేకుండా పోతుందన్నారు. వెంటనే టిప్పర్లను నిర్వాహకులు జేసీబీలతో నింపుతున్నారని, దీని వల్ల తమకు కూలీ దొరకడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు.

బెజ్జోరా గ్రామంలో ఇసుక డంప్ సీజ్



సీజ్ చేసిన ఇసుకను పరిశీలిస్తున్న తహసీల్దార్

భీమ్‌గల్ రూరల్, ఏప్రిల్29 (ఆంధ్రజ్యోతి):మండలంలోని బెజ్జోరా గ్రామంలోని కప్పల వాగునుండి అక్రమంగా ట్రాక్టర్‌లతో ఇసుకను తీసి డంపు చేశారని, వచ్చిన సమాచారం మేరకు రెవెన్యూ అధికారులు మంగళవారం ఆ డంప్ ను పరిశీలించారు. డంఫ్ చేసిన వారిని వే బిల్లులు అడగగా వారివద్ద ఎలాంటి అనుమతి లేకపోవడంతో డంప్ చేసిన 25 ట్రాక్టర్ల ఆసుకను సీజ్ చేశారు. ఆ సీజ్ చేసిన ఇసుకను వచ్చే నెల ఒకటవ తేదీ ఉదయం 12 గంటలకు బహిరంగంగా వేలంపాట నిర్వహించడం జరుగుతుందని తహసీల్దార్ మహమ్మద్ షబ్బీర్ తెలిపారు. వేలంపాటలో పాల్గొనే వారు ముందుగా పదివేల రూపాయలు తహసీల్దార్ కార్యాలయంలో డిపాజిట్ చేయాలని ఎవరు ఎక్కువ వేలం పాడితే వారికే ఇసుకను స్వాధీనం చేస్తామన్నారు. ఒకవేల వేలం దక్కని వారికి డిపాజిట్ చేసిన సొమ్ము తిరిగి ఇవ్వడం జరుగుతుందని తహసీల్దార్ తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలో నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా ఇసుక తరలిస్తే వాల్టాచట్టం ప్రకారం వాహనాలను సీజ్ చేసి ఇసుక మాఫీయాపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

లారీల కొరతను తీర్చాలని శాఖాపూర్‌లో రాస్తారోకో

నవీపేట,ఏప్రిల్29(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి లారీల కొరతను వెంటనే తీర్చాలని కోరుతూ మంగళవారం సాయంత్రం మండలంలోని లింగాపూర్ పంచాయతీ పరిధిలోని శాఖాపూర్ శివారులో పలువురు రైతులు రాస్తారోకో నిర్వహించారు. మండలంలోని బినోల సొసైటీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయగా ధాన్యం తూకం వేసి 10 రోజులు గడుస్తున్న లారీలు అందుబాటులో లేకపోవడంతో తాము ఇబ్బందులు పడుతున్నామని రైతులు పేర్కొన్నారు. ఈ విషయంపై తమకు వెంటనే న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఏఎస్ఐ యాదగిరి గౌడ్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది రాస్తారోకో ప్రదేశానికి చేరుకుని వారికి నచ్చజెప్పడంతో వారు తమ ఆందోళన విరమించారు.ఈ కార్యక్రమంలో శాఖాపూర్‌కు చెందిన పలువురు రైతులు పాల్గొన్నారు.



రాస్తారోకో నిర్వహిస్తున్న రైతులు

సర్వేను పరిశీలించిన కమిషనర్

ఆర్మూర్ టౌన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి):మున్సిపల్ పరిధిలో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను మంగళవారం మున్సిపల్ కమీషనర్ రాజు పరిశీలించారు.దరఖాస్తుదారుల స్థితిగతులను, అర్హతలను నమోదు చేయాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట క్లస్టర్ ఆఫీసర్‌లు కిరణ్, కిషన్, వార్డు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీనియర్ సివిల్ న్యాయాధికారిగా శ్రీదేవి

ఆర్మూర్‌టౌన్,ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మున్సిఫ్ కోర్టులో ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ న్యాయాధికారిగా శ్రీదేవి మంగళవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్ ప్రతినిధులు స్వాగతం పలికి శాలువ, పుష్పగుచ్ఛంతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏ.బాబాగౌడ్, లయన్ గుజరాతీ నివేదన్, అశోక్ పాల్గొన్నారు.



న్యాయాధికారిని సన్మానిస్తున్న మీడియేషన్ సెంటర్ ప్రతినిధులు

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

మాక్లూర్,ఏప్రిల్29(ఆంధ్రజ్యోతి):మండలంలోని అమ్రాద్ గ్రామంలో మంగళవారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు పశువైద్యధికారి డాక్టర్ కిరణ్‌దేశ్ పాండే తెలిపారు. పాడిరైతులు ఇట్టి టీకాలను తమ పశువులకు తప్పకుండా తీసుకోవాలని తద్వార పశువుల పునరుత్పత్తి సామర్థ్యం తగ్గకుండా సమూలంగా వ్యాధిని పారదోలడానికి ప్రతీ పశువుకు టీకాలు వేయవల్సిన అవసరం ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది వినిత, కళ్యాణి, షైమద్‌పాషా, శ్యామల, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడితే కేసులు

ఏర్గట్ల, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని ఏర్గట్ల ఎస్సై రాము తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో డ్రంకెన్‌డ్రైవ్ వాహనాల తనిఖీ చేశారు. అందులో భాగంగా వాహనదారులకు డ్రంకెన్‌డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. ద్విచక్ర వాహనదారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని, సరియైన ధృవీకరణ పత్రాలు వెంట ఉంచుకోవాలని వాహనదారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది శివయ్య, సుమన్, కిషోర్‌లు పాల్గొన్నారు.

చెరువు తూము షట్టర్లకు మరమ్మతులు చేయించాలని వినతి

ఆర్మూర్‌రూరల్,ఏప్రిల్29(ఆంధ్రజ్యోతి):ఆర్మూర్ పట్టణంలోని గూండ్ల చెరువు మూడు తూములకు షట్టర్లకు మరమ్మత్తులు చేయించాలని ఆర్మూర్‌లోని మూడు పంతాల రైతులు ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డిని కలిసి విన్నవించారు.కాశీహనుమాన్ పంతా,గురడి కాపు పంతా, కాపెల్లిపంతా రైతులు మంగళవారం వినయ్‌రెడ్డిని కలిసి మర మ్మతు లు చేయించాలని కోరారు.తూములకు మరమ్మతులు చేయిస్తు సుమా రు 400 ఎకరాల ఆయకట్టుకు తాగునీరు అందుతుందని రైతులు తెలిపారు. స్పం దించిన వినయ్‌రెడ్డి ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్క రి స్తామనిఅన్నారు.ఈకార్యక్రమంలో మూడుపంతాల రైతులు,నాయకులు ఉన్నారు.

ప్రమాదాల నివారణకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలి

బోధన్‌రూరల్,ఏప్రిల్29(ఆంధ్రజ్యోతి):ప్రయాణికులను సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేర్పించడంలో ఆటో డ్రైవర్లు జాగ్రత్తలు పాటించాలని బోధన్ పట్టణ సీఐ వెంకట నారాయణ, ట్రాఫిక్ సీఐ మంగళవారం ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. అంబేద్కర్ చౌరస్తాలో అడ్డదిడ్డంగా ఆటోలను పెట్టవద్దన్నారు.ఈకార్యక్రమంలో పోలీసు సిబ్బంది,ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరు హెల్మెట్ ధరించాలి

నవీపేట,ఏప్రిల్29(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించాలని ఎస్ఐ వినయ్ కోరారు. మంగళవారం నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య ఆదేశాల మేరకు స్థానిక బాసర రోడ్డు మూల మలుపు వద్ద హెల్మెట్ ధారణపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. మైనర్ పిల్లలకు ద్విచక్ర వాహనాలు ఇవ్వవద్దని ఆయన సూచించారు.

48గ్రాముల అల్ఫాజోలం పట్టివేత: ఇద్దరి అరెస్టు

నవీపేట,ఏప్రిల్29(ఆంధ్రజ్యోతి): మండలంలోని జన్నేపల్లిలో సుద్దులం భూమాగౌడ్ వద్ద 21గ్రాముల అల్ఫాజోలం, మండలంలోని తుంగినికి చెందిన రామాగౌడ్ వద్ద 27గ్రాముల నిషేధిత అల్ఫాజోలంను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వినయ్ తెలిపారు. సంబంధిత నిషేధిత అల్ఫాజోలంను కల్లులో కలిపి విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు దాడులు జరిపి ఈ అల్ఫాజోలంను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. సంబంధిత అల్ఫాజోలం విలువ సుమారు 24వేల రూపాయల వరకు ఉంటుందని ఎస్ఐ వివరించారు. ఈ మేరకు సుద్దులం భూమాగౌడ్, రామాగౌడ్‌లను మంగళవారం అరెస్టు చేయడంతో పాటు వీరి వద్ద ఉన్న బైక్‌ను సైతం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. సుద్దులం భూమాగౌడ్ మాక్లూర్ మండలం చిక్లీకి చెందిన వ్యక్తి అని అతడు జన్నేపల్లిలో కల్లు డిపోను లీజుకు తీసుకుని నడిపిస్తున్నాడని ఎస్ఐ తెలిపారు.


నిల్వ ఉన్న ధాన్యం బస్తాలు


రైతులు రోడ్డుపై ఆరబోసిన వరి ధాన్యం


ధాన్యం వెంటనే తరలించాలని రాస్తారోకో చేస్తున్న రైతులు(ఫైల్)

మందకొడిగా ధాన్యం కొనుగోళ్లు

● నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ ప్రాంత పరిధిలో ధాన్యం కొనుగోళ్లలో మరింత ఆలస్యం ● రోడ్లపైనే ధాన్యం బస్తాలు ● వర్షాలు కురుస్తాయని ఆందోళనలో రైతులు

ఆర్మూర్ రూరల్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ మందకోడిగా సాగుతోంది. ముఖ్యంగా నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ పరిధలో ఆలస్యం జరుగుతోందంటున్నారు. వర్షాకాలంతో పోల్చి చూస్తే యాసంగిలో ఎక్కువ విస్తీర్ణంలో వరి సాగులో సన్నరకాల సాగుకే రైతులు మొగ్గుచూపారు. ఖరీఫ్‌లో ప్రభుత్వం సన్నరకం వరిధాన్యానికి క్వింటాలుకు రూ.500 లు బోనస్ ఇవ్వడంతో రైతులు యాసంగిలో అధిక విస్తీర్ణంలో సన్నరకాలను సాగుచేశారు. గత సంవత్సరం సన్నరకం వడ్లను రైతులు ముందుగానే భయటవ్యాపారులకు విక్రయించారు. అనంతరం ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి సేకరించిన వరిదాన్యానికి సన్నరకానికి క్వింటాలుకు రూ. 500లు బోనస్‌లు అందజేసింది. ఇది రైతులకు ఎంతో ప్రయోజనాన్ని చేకూర్చింది. రైతు భరోసా డబ్బులు వేయకున్న దానిని మర్చిపోయారు. ప్రస్తుతం సన్నరకం దాన్యం పండించిన ప్రతీరైతు రూ. 500 లు బోనస్ దృష్టిలో ఉంచుకొని కొనుగోలు కేంద్రాలలోనే విక్రయిస్తున్నారు. దీంతో దాన్యం బస్తాల తరలింపులో జాప్యం జరుగుతుంది.

వేధిస్తున్న లారీల కొరత

దాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి వరిదాన్యం బస్తాలను రైస్ మిల్లులకు చేరవేయడానికి లారీల కొరత ఏర్పడింది. జిల్లాలో 65 రైస్ మిల్లులకే దాన్యాన్ని పంపాల్సి ఉంటుంది. లారీలు తీసుకెళ్తున్న దాన్యాన్ని రైస్‌మిల్లుల్లో అన్‌లోడ్ చేయడానికి రెండురోజుల సమయం పడుతుండటంతో దాన్యం నిల్వలు అలాగే ఉంటున్నాయి. గత సంవత్సరం ఒక్క కొనుగోలు కేంద్రం నుంచి రోజుకు నాలుగు లారీల ధాన్యం రైస్‌మిల్లులకు చేరవేయగా ప్రస్తుతం రెండు లారీలు మాత్రమే వెళ్తుండడంతో దాన్యం బస్తాలు లిఫ్ట్ చేయడంలో జాప్యం జరుగుతుంది. సకాలంలో లారీలు రాకపోయే సరికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అంతేకాకుండా స్థానిక రైస్‌మిల్లులలో ధాన్యాన్ని కోట ప్రకారం పంపాల్సి వస్తుంది. రైస్‌మిల్లు కోట ముగిసిపోతే అధికారులు అలాట్‌మెంట్ చేసేవరకు వేసిచూడాల్సిందే. దీనివల్ల రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు.

ఆందోళనకు గురవుతున్న రైతులు

ఇటీవల కురిసిన అకాల వర్షాలకు రైతులు ఆరబెట్టిన దాన్యం తడిసిపోయింది. కొనుగోలు కేంద్రాలలో తూకం వేసిన దాన్యం బస్తాలు అలాగే ఉండడంతో ఎండకు ఎండిన, వర్షాలకు తడిసిన నష్టపోవాల్సింది రైతులే. దీనిని దృష్టిలో పెట్టుకుని తమ దాన్యాన్ని వెంటవెంటనే తరలించాలని డిమాండ్ చేస్తూ పలుచోట్ల రాస్తారోకో, ధర్నాలు నిర్వహిస్తున్నారు. అంతేకాకుండా ప్రస్తుత వాతావరణ పరిస్థితులలో వర్షాలు కురిస్తే తాము పండించిన పంట చేతుకు రాకుండా పోతుందని దాన్యం తడిసిన, ధాన్యం రంగుమారిన తమకు నష్టాలే మిగులుతాయని రైతులు ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ అధికారులు లారీలా కొరతను లేకుండా చూసి కొనుగోలు కేంద్రాల నుంచి దాన్యం బస్తాలను వెంటవెంటనే తరలించి రైతులు నష్టపోకుండా చూడాలని వారు కోరుతున్నారు.

సకల శుభాలను అందించే

అక్షయ తృతీయ



నిజామాబాద్ కల్చరల్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): సకల శుభాలను అందించే పర్వదినంగా అక్షయ తృతీయను జరుపుకుంటారు. ఏడాది పొడవునా వచ్చే అత్యంత శుభ ముహూర్తాలలో అక్షయ తృతీయ ఒక్కటి. అక్షయ తృతీయ నాడు నిర్వహించే ప్రతీ పనిలో విజయవంతం అవుతుందని విశ్వసిస్తారు. ఈ రోజున చేసే ధానం, పూజ, పనులు, శుభ ముహూర్తాలు తరిగిపోవని శాస్త్రం చెబుతోంది. అక్షయ తృతీయ పర్వదినాన్న ఆలయాల్లో పెద్ద ఎత్తున ప్రత్యేక పూజలతో పాటు పలు ఆలయాల్లో దేవతా మూర్తులకు చందన ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా అక్షయ తృతీయ పర్వదినాన్ని పురస్కరించుకొని వందలాది శుభ ముహూర్తాలకు వేదిక అవుతోంది. అక్షయ తృతీయ పర్వదినాన్ని పురస్కరించుకొని ఆలయాల్లో ప్రత్యేక పూజాది కార్యక్రమాలకు ఆయా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సిద్ధమయ్యాయి.

● వ్యాపార వర్గాలు ప్రత్యేక ఏర్పాట్లు

అంతేకాకుండా.. అక్షయ తృతీయ పర్వదినాన్ని పురస్కరించుకొని వ్యాపార వర్గాలు ప్రత్యేక ఏర్పాట్లు చేసుకున్నాయి. ఈరోజున చేసే కొనుగోలు సంవత్సరం పొడవున మంచి జరుగుతుందనే భావనతో వినియోగదారులు అక్షయ తృతీయ పర్వదినాన్న కొనుగోళ్ల చేయడానికి ఆసక్తి చూపుతారు. దీన్ని అదనుగా చూసుకొని వ్యాపారులు వినియోగదారులను ఆకర్షించడానికి ప్రత్యేక ఆఫర్లు ప్రకటిస్తున్నారు. గృహ సంబంధమైన వస్తువులతో పాటు ఈ పర్వదినాన్న బంగారు కొనుగోళ్లపై ఆసక్తి చూపడంతో ప్రతీ గ్రాము బంగారం కొనుగోలుపై వ్యాపారులు ప్రత్యేక బహుమతి ఇస్తామని ప్రకటించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కొనుగోళ్లపై ప్రత్యేక ఆఫర్లు ఉంటాయని ప్రకటించడంతో పాటు బంగారం కొనుగోలు చేసిన వారికి పూజా కార్యక్రమాలు చేసి బంగారాన్ని అందించడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

కాలభైరవ స్వామి

ఆలయంలో ప్రత్యేక పూజలు

● వైశాఖమాసం తొలి మంగళవారం అధిక సంఖ్యలో హాజరైన భక్తులు


కాలభైరవ స్వామికి పండ్లతో ప్రత్యేక పూజలు

రామారెడ్డి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రానికి పది కిలో మీటర్ల దూరంలో ఉన్న రామారెడ్డి మండల కేంద్రం- ఇసన్నపల్లి గ్రామాల మధ్య వెలసిన కాలభైరవ స్వామి ఆలయంలో వైశాఖమాసం తొలి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పురోహితులు శ్రీనివాస్ శర్మ మంత్రోచ్చారణలతో గర్భగుడిలో పాలాభిషేకం, సింధూర, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఓం భైరవ.. ఓంటం కాలభైరవ స్వామి అనే నామ స్మరణతో వైశాఖమాసం తొలి రోజునే ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. దేవున్ని వివిధ రకాల పండ్లతో ప్రత్యేకంగా అలంకరించారు. కామారెడ్డి జిల్లాతో పాటు వివిధ జిల్లాల భక్తులు అధిక సంఖ్యలో హాజరై మొక్కలు చెల్లించుకున్నారు. బావి వద్ద స్నానాలు చేసి తడి బట్టలతో దేవునికి దర్శించుకుని పూజలు నిర్వహించారు. అంతేకాకుండా శనేశ్వరాలయం, నవగ్రహాలయం, నాగేశ్వరాలయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవుని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ బుర్ల ప్రభురాం చంద్రం గుప్తా, ఆలయ జూనియర్ అసిస్టెంట్ లక్ష్మణ్, అధికారులు, ఆలయ కమిటీ మాజీ చైర్మెనులు దోమకొండ శ్రీనివాస్ గుప్తా, గంజి సతీష్ గుప్తా మాజీ, రాజకీయ నాయకులు, వ్యాపారులు, వైద్యులు, ఆలయ సిబ్బంది నాగరాజు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.


ఆలయానికి అధిక సంఖ్యలో తరలి వచ్చిన భక్తులు

శిథిలావస్థలో పశు వైద్య శాలలు

● ఇప్పట్టికీ ఇన్‌చార్జి డాక్టర్‌తోనే కొనసాగుతున్న వేల్పూర్ పశువైద్య శాల ● అయినా పట్టించుకోని అధికారులు

వేల్పూర్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని పచ్చలనడ్కుడ పశు వైద్యశాల మినహ మిగతా వేల్పూర్, పడిగెల, అంక్సాపూర్ గ్రామాలలో పశువైద్యశాల భవనాలు పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. ఈ దుస్థితి గత కొన్నేళ్ల నుంచి ఉంటు ప్రస్తుతం భవనాలు కూలడానికి ఉన్నప్పటికి ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని రైతులు తీవ్ర ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. చిన్నపాటి వర్షం పడితే చాలు ఈ భవనాల స్లాబుపై నీరునిలిచి గోడల నుంచి నీళ్లు కారుతూ గోడలు తడిసి ముద్దవుతున్నాయి. అంతేకాకుండా భవనాల స్లాబ్‌ల పై నుంచి పెచ్చులూడి పడుతున్నాయి. ఎప్పుడు కూలిపోతాయో అని భయపడుతూ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. మండలంలో మొత్తం 18 గ్రామ పంచాయతీలు ఉండగా.. కేవలం 4 గ్రామాలలో మాత్రమే పశువైద్య శాలలు ఉన్నాయి. అందులో మూడు పశువైద్యశాల భవనాలు పూర్తిగా శిథిలావస్థలో ఉన్నాయి. ఆ భవనాలు సుమారు యాభైయేళ్ల క్రితం నిర్మించినట్లు ఆయా గ్రామాల రైతులు అంటున్నారు. ప్రస్తుతం అంక్సాపూర్ గ్రామంలో శిథిలావస్థకు చేరిన పాత గ్రామ పంచాయితీ భవనంలో పశు వైద్యశాలను కొనసాగిస్తున్నారు. మండల గ్రామాలలో కలిపి గొర్రెలు, మేకలు సుమారు 15వేలు, గోజాతి గేదె జాతి కలిపి సుమారు 6వేల వరకు ఉంటాయని పశువైద్య సిబ్బంది తెలిపారు. 18 జీపీల పరిధిలో కేవలం 4 మాత్రమే పశువైద్య శాలలు ఉన్నందున మిగతా గ్రామాలలోని పశువులకు వ్యాధులు సోకితే చికిత్సల కోసం ఆ వైద్యశాలలకు వెళ్లాలంటే రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. పశువులు, గొర్రెమేకలు ఎక్కువగా ఉన్న గ్రామాల్లో గోపాలమిత్ర కేంద్రాలను ఏర్పాటు చేసి పశువుల వైద్యాన్ని అందుబాటులో ఉంచాలని రైతులు కోరుతున్నారు. ఇప్పటికైన ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి శిథిలావస్థలో ఉన్న భవనాల స్థానంలోనే నూతనంగా భవనాలను నాణ్యతతో నిర్మించాలని రైతులు కోరుతున్నారు.


కూలడానికి సిద్ధంగా ఉన్న పడిగెల పశువైధ్యశాల భవనం

వేల్పూర్ పశువైద్య శాలకు ఇన్‌చార్జి డాక్టరే దిక్కు

మండల కేంద్రమైన వేల్పూర్ పశువైద్యశాలకు గత కొన్ని సంవత్సరాలుగా ఇన్‌చార్జి డాక్టరే విధులను నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం డాక్టర్ సంతోష్‌రెడ్డి పచ్చల నడ్కుడ గ్రామ వైద్యశాలకు పర్మినెంట్ డాక్టర్‌గా విధులు నిర్వహిస్తు, అదనంగా వేల్పూర్‌కు ఇంచార్జిగా వ్యవహరిస్తున్నారు. దీంతో పశువులకు సకాలంలో వైద్యం అందించడంలో ఇబ్బందులు తప్పడంలేదని రైతులు ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన వేల్పూర్ పశువైద్యశాలకు పర్మినెంట్ డాక్టర్‌ను నియమించి పశువులకు వైద్యం అందుబాటులోకి తేవాలని రైతులు కోరుతున్నారు.


శిథిలావస్థకు చేరిన వేల్పూర్ పశు వైధ్యశాల భవనం

నూతన భవనాల నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపాం

: సంతోష్‌రెడ్డి, పశువైద్యాధికారి, వేల్పూర్

వేల్పూర్, పడిగెల, అంక్సాపూర్ గ్రామాలలో పశువైద్య శాలలకు నూతన భవనాల నిర్మాణం కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. ఆ మూడు గ్రామాలలోని పశువైద్యశాల భవనాలు ప్రస్తుతం శిథిలావస్థకు చేరాయి. ఇలాంటి పరిస్థితుల్లో నూతన భవనాలు నిర్మించాల్సి ఉంది.

భిక్కనూరు సౌత్ క్యాంపస్‌లో వంటావార్పు

భిక్కనూరు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి) భిక్కనూరు మండలంలోని బీటీఎస్ చౌరస్తాలో గల తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్ ప్రాంగణంలో పార్ట్ టైం అధ్యాపకులు నిరవధిక సమ్మెలో భాగంగా వంటావార్పు కార్యక్రమాన్ని నిర్వహించి వినూత్నంగా నిరసన తెలిపారు. దీనిలో భాగంగా సౌత్ క్యాంపస్‌లో నిర్వహిస్తున్న సమ్మె మంగళవారం 8వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం తమ న్యాయమైనా డిమాండ్‌లను పరిష్కరించాలని, వెంటనే జీవో నెం.21ను రద్దు చేయాలని, తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని వారు ఈ సందర్భంగా కోరారు. లేనియెడల కుటుంబ సభ్యులతో కలిసి ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం సహ పంక్తి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో పార్ట్‌టైం, కాంట్రాక్ట్, రెగ్యూలర్ అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.


వంటా వార్పు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న అధ్యాపకులు

పాఠశాలలకు సెలవులు.. వ్యవసాయ పనుల్లో చిన్నారులు!

జుక్కల్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పిల్లలకు సెలవులు ప్రకటించడంతో పసిపిల్లలు వ్యవసాయ పనుల్లో వారి తల్లిదండ్రులకు ఆసరాగా నిలుస్తూ వ్యవసాయ పనులు చేస్తున్నారు. మంగళవారం జుక్కల్ మండలం బస్వాపూర్ గ్రామం వద్ద రోడ్డుపై వరి ధాన్యం, పిల్లలు ఎండ బెట్టారు. వ్యవసాయ కుటుంబంలో ఉన్న పిల్లలు వారి తల్లిదండ్రులతో పాటు వ్యవసాయ పనుల్లో పాలుపంచుకుంటున్నారు. వరి ధాన్యం ఎండబెట్టడం పశువులకు నీళ్ల తాగించడం గ్రామీణ ప్రాంతాల్లో పిల్లలు చేస్తున్న పనులు దర్శనమిస్తున్నాయి.


వరి ధాన్యం ఆరబోస్తున్న చిన్నారులు



చిత్రలేఖనంలో రాణిస్తున్న బుడ్డోడు

● చేతితో అందమైన చిత్రాలు గీస్తున్న సాయిరుద్ర
● పలు పోటీల్లో బహుమతులు




దేశ నాయకులు, ప్రకృతి అందాల ఫొటోలు గీసిన సాయిరుద్ర

గాంధారి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): నేటి రోజుల్లో పిల్లలు పాఠశాల ముగియగానే ఇంటికి వచ్చిన తర్వాత ఎక్కువ సమయం ఫోన్‌లు, టీవీలలోనే గడిపేస్తున్నారు. దీంతో పిల్లల్లో ఇతర నైపుణ్యాలకు చోటు లేకుండా పోయింది. పిల్లలు తమ విరమకాల సమయంలో వారికి ఉన్న ఆసక్తిలో తగినంత శిక్షణ అందిస్తే.. వారు విభిన్న రంగాల్లో రాణించగలరు. ఆరో తరగతి చదువుతున్న సాయిరుద్ర చిత్రలేఖనంలో తనకున్న ఆసక్తితో అద్భుతమైన చిత్రాలు గీస్తు తన ప్రత్యేకతను చాటుకుంటున్నాడు.

ఆరో తరగతిలోనే అందమైన చిత్రాలు


సాయిరుద్ర జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఆరోతరగతి చదువుతున్నాడు. చిత్రలేఖనంలో తనకున్న ఆసక్తితో ప్రతీరోజు పాఠశాల నుంచి రాగానే.. ఆకర్షణీయమైన చిత్రాలు గీయడం అలవాటు చేసుకున్నాడు. చిత్రాలు వేయడంలో పాటు వాటికి అద్భుతమైన రంగులు వేస్తు చక్కని రూపం వచ్చేలా చిత్రాలు గీస్తున్నాడు.

అన్నిరకాల చిత్రాలు

చిత్రలేఖనంలో కేవలం ఒకరమైన చిత్రాలే కాకుండా అన్ని రకాలైన చిత్రాలు గీస్తు అబ్బురపరుస్తున్నాడు. దేశ నాయకులైన గాంధీ, భగత్‌సింగ్, మోదీలతో ఇలా వ్యక్తుల ఫొటోలతో పాటు, ప్రకృతికి సంబంధించిన అద్భుతమైన చిత్రాలు, దేవతల చిత్రాలు, సాధారణ వ్యక్తుల చిత్రాలు కళ్లకు కట్టినట్లుగా గీయడం సాయిరుద్ర ప్రత్యేకత. అంతేకాకుండా సముద్రం, అలలు, లైట్‌హౌస్ వంటి చిత్రాలు నిజమనే భ్రమను కలించేలా గీశాడు.

పలు పోటీల్లో బహుమతులు

పాఠశాలలో నిర్వహించే చిత్రలేఖన పోటీలలో పలుమార్లు బహుమతులు గెలుచుకున్నాడు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో బాలోత్సవ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన చిత్రలేఖన పోటీలో ద్వితీయ స్థానం సాధించాడు. అదేవిధంగా రిలియన్స్ సంస్థ నిర్వహించిన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి పురస్కారం అందుకున్నాడు.


ఆజాద్ ఫొటోను గీస్తున్న సాయి


పోటీలలో బహుమతులు గెలుచుకున్న సాయి



కళాశాలలో పాఠాలు బోధిస్తున్న అధ్యాపకులు

ప్రభుత్వ కళాశాలలో ప్రత్యేక తరగతులు

గాంధారి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): గాంధారి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ గంగారం వెల్లడించారు. ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్ష ఫలితాల్లో ఫేయిల్ అయిన విద్యార్థులకు గత రెండు రోజుల నుంచి ప్రత్యేక తరగతులు ప్రారంభించామని వచ్చే నెల 22 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్న నేపథ్యంలో ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థుల కోసం అన్ని సబ్జెక్టుల అధ్యాపకులు కళాశాలకు వచ్చి ఫేయిల్ అయిన విద్యార్థులకు బోధన చేస్తున్నారని తెలిపారు. ఒకరోజు కళాశాలలో మరో రోజు ఆన్‌లైన్‌లో సైతం శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కళాశాలకు రాలేని విద్యార్థులు ఆన్‌లైన్‌లో తరగతులకు హాజరు కావాలని తెలిపారు. తల్లిదండ్రులు సైతం తమ పిల్లలు స్పెషల్ క్లాసులకు హాజరయ్యే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

సదాశివనగర్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్లను వేగవంతం చేసి ధాన్యాన్ని త్వరగా మిల్లులకు తరలించాలని మాజీ జడ్పీటీసీ రాజేశ్వర్‌రావు కోరారు. వాతావరణ పరిస్థితుల దృష్ట్యా అకాల వర్షాలు పడే అవకాశం ఉండడంతో కొనుగోలు కేంద్రాల్లో రైతులు కాలం గడపాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కొనుగోలు నిర్వాహకులు తేమ శాతం వచ్చిన ధాన్యాన్ని వెంటనే తూకం వేసి మిల్లులకు తరలించాలన్నారు. లారీలు అందుబాటులో లేవన్న సాకుతో ఆలస్యం చేయవద్దన్నారు. రైతుల వద్ద నుంచి ధాన్యం తరలించే సమయంలోనే సరైన ధ్రువ పత్రాలు సేకరించి రెండు రోజుల్లోనే రైతు ఖాతాలో డబ్బులు వేయాలన్నారు.



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

క్రీడల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించాలి

పెద్ద కొడప్‌గల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): క్రీడా పోటీల్లో గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలని కాంగ్రెస్ నాయకులు మల్లప్ప పటేల్ క్రీడాకారులకు సూచించారు. మండలంలోని కాటేపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన అండర్ 17 క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మల్లప్ప పటేల్ మాట్లాడుతూ క్రీడలు ఆడటం వల్ల దేహదారుఢ్యం మెరుగుపడటంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని తెలిపారు. క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలన్నారు. అనంతరం నిర్వాహకులు మాట్లాడుతూ ఈ పోటీల్లో 18 జట్లు తలపడనున్నాయని, విజేతకు తగిన బహుమతి అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో చిన్న కొడప్‌గల్ సహకార సంఘ వైస్ చైర్మన్ గంగాగౌడ్, నాయకులు రాంచందర్, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

బీర్కూర్‌లో కంటి వైద్య శిబిరం

బీర్కూర్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని లయన్స్ భవనంలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. సుమారు 30 మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్లు లయన్స్ క్లబ్ వైద్యుడు డాక్టర్ సందీప్ తెలిపారు. కంటి సమస్యతో బాధపడుతున్న వారికి ఉచితంగా మందులు కంటి అద్దాలు అందజేశారు. మోతి బిందు ఉన్న వారిని గుర్తించి వారికి శస్త్ర చికిత్స నిమిత్తం బోధన్ లయన్స్ ఆసుపత్రికి తరలించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



బస్వాపూర్‌లో వన్య ప్రాణాలుకు సాసర్‌పిట్‌లో నీరు నింపుతున్న దృశ్యం

వేసవిలో వన్య ప్రాణుల దాహం తీర్చడమే లక్ష్యం

జుక్కల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): అటవీ ప్రాంతాల్లో వన్య ప్రాణుల దాహం తీర్చడమే అధికారుల లక్ష్యమని బీట్ అధికారి రాములు అన్నారు. మండలంలోని బస్వాపూర్ కౌలాస్ అటవీ ప్రాంతాల్లో వేసవి కాలంలో వన్య ప్రాణులకు ట్యాంకర్ ద్వారా సాసర్ పిట్‌లో నీరు నింపి దాహం తీర్చాలని అధికారులను బీట్ అధికారి రాములు ఆదేశించారు. అటవీ ప్రాంతంలో నివసించేవారు వారు ఇంటి ఆవరణలో పక్షులకు నీరు పోసే విధంగా ఏర్పాటు చేసుకోవాలని ఆయన సూచించారు. అటవీ ప్రాంతాల్లో అటవీ అధికారులు ఆదేశాల మేరకు నాలుగు రోజులకు ఒకసారి సాసర్ పిట్‌లో నీరు నింపడం జరుగుతుందని ఆయన తెలిపారు. రాత్రి సమయంలో మూగ జీవాలు నీరు తాగి సేద తీరుతాయని ఆయన అన్నారు.

వరి కొనుగోలు కేంద్రాల పరిశీలన

రాజంపేట, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆరేపల్లి గ్రామంలో మంగళవారం వడ్ల కొనుగోలు కేంద్రాలను డీపీఎం రమేష్‌బాబు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మ్యాచర్ 15 రావాలని, కమిటి సభ్యులకు వడ్లుకాంటా అయిన వెంటనే లారీలు లోడు చేసి పంపాలని తెలిపారు. రైతువారి రిజిస్టర్ సీరియల్ వైస్ రాయాలని సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం సాయిలు తదితరులు పాల్గొన్నారు.

అంతంపల్లి గుడాడి రెడ్డి సంఘం కార్యవర్గం ఎన్నిక

భిక్కనూరు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి) మండలంలోని అంతంపల్లి గ్రామ గుడాడి రెడ్డి సంఘం నూతన కార్యవర్గాన్ని మంగళవారం సంఘసభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా చిట్టెడి ప్రభాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా నల్లగొండ సాయిరెడ్డి, కోశాధికారిగా కుంట అమృతారెడ్డి, కార్యవర్గ సభ్యులుగా చిట్టెడి మధుమోహన్‌రెడ్డి, కుంట భానుతేజరెడ్డి, నల్లగొండ సురేందర్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ గ్రామంలో సంఘం అభివృద్ధికి పూర్తి సమయాన్ని కేటాయించి అందరిని లుపుకుని ముందుకు సాగుతామన్నారు. అనంతరం సభ్యుల సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

జోరందుకున్న ధాన్యం కొనుగోళ్లు

దోమకొండ, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి):దోమకొండ మండలంలోని ఆయా గ్రామాల్లో సింగిల్‌విండో, ఐకేపీల ద్వారా ఏర్పాటు చేసిన వరిధాన్యం కేంద్రాల్లో ధాన్యాన్ని తూకం చేసి రైస్‌మిల్లులకు తరలించడం జరుగుతుందని విండో చైర్మన్ నాగరాజిరెడ్డి, సీఈవో బాల్‌రెడ్డి, ఏపీఎం రాజు తెలిపారు. గ్రామాల్లో సిబ్బంది రైతుల పేర్లు సిరియల్‌గా రికార్డుల్లో నమోదు చేసి షైచర్ తీసి తూకం వేయడం జరుగుతుందన్నారు.

పేద రైతుల కోసమే భూ భారతి

భూ భారతి చట్టం చరిత్రలో నిలిచిపోతుంది

● ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు



భూ భారతి చట్టం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రైతులు గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో భూ సమస్యల కోసం తీవ్ర ఇబ్బందులు పడ్డారని చివరకు గొడవలకు దారి తీసి ప్రాణాలు కోల్పోయిన ఘటనలు ఉన్నాయని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు అన్నారు. కోట్లు సంపాదించుకునేందుకే మాజీ సీఎం కేసీఆర్ ధరణిని రూపొందించారని ఆరోపించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి అమలులోకి తీసుకువచ్చిన భూ భారతి చట్టం పేద రైతుల భూ సమస్యల పరిష్కారానికి దారి చూపనుందని అన్నారు. ఇకపై కార్యాలయాల చుట్టూ తిరగకుండా క్షేత్రస్థాయిలో రెవెన్యూ అధికారులే పరిష్కరించేలా చట్టం ఉందన్నారు. పైలెట్ ప్రాజెక్ట్ లింగంపేట మండలాన్ని ఎంపిక చేసి మా ప్రాంత రైతుల భూ సమస్యల పరిష్కారానికి కృషి చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ ఎంపీ సురేష్‌షెట్కార్, కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్, ఎస్పీ రాజేష్‌చంద్ర, అదనపు కలెక్టర్ విక్టర్, సబ్ కలెక్టర్ కిరణ్మయి, జడ్పీ సీఈవో చందర్‌నాయక్, డీఆర్‌డీఏ పీడీ సురేందర్, డీఏవో తిరుమల ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

(5వ పేజీ తరువాయి)

ప్రభుత్వంలో ధరణితో రైతులు ఎంతో ఇబ్బందులు పడ్డారని అన్నారు. కేసీఆర్ నోటికి వచ్చినట్లు ధరణిలో ఆప్షన్‌లను కేటాయిస్తూ రైతుల భూ సమస్యలు పరిష్కారం కాకుండా చేశారని ఆరోపించారు. చివరకు గ్రామాల్లోని రెవెన్యూ అధికారి, సిబ్బంది వ్యవస్థ లేకుండా ఆ శాఖను పూర్తిగా భ్రష్టుపట్టించారని అన్నారు. ధరణి కేవలం కేసీఆర్ కొంత మంది వ్యక్తుల కోసమే రూపొందించాడని ధరణితో లక్షల కోట్ల విలువ చేసే భూములను కొల్లగొట్టారని ఆరోపించారు. అసెంబ్లీలో ఈ చట్టాన్ని బీఆర్ఎస్ అడ్డుకునే ప్రయత్నం చేసిందన్నారు. ఇకపై రెవెన్యూ యంత్రాంగమే భూ సమస్యలు పరిష్కరిస్తుందన్నారు. భూ భారతి చట్టం ద్వారా రైతుల భూ సమస్యల కోసం తహసీల్దార్, ఆర్‌డీవో, అదనపు కలెక్టర్, కలెక్టర్ స్థాయిలోనూ పరిష్కరించుకోవచ్చని అన్నారు. అక్కడ పరిష్కారం కానివి సీసీఎల్ స్థాయిలోనూ అక్కడ కూడా కాకపోతే ప్రత్యేక ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేసి సమస్యలు లేకుండా చూస్తామన్నారు. అటవీ భూముల సమస్యలను కూడా ఈ చట్టం ద్వారా పరిష్కరిస్తామని అన్నారు. భవిష్యత్తులో రైతులకు భూ సమస్యలు లేకుండా ఉండేందుకు భూ భారతి చట్టాన్ని అమలులోకి తెచ్చామన్నారు.

ఆగస్టులోగా భూ సమస్యలను పరిష్కరిస్తాం

ఆగస్టు వరకు ఇందిరమ్మ ప్రభుత్వంలో రాష్ట్రంలో భూ సమస్యలు లేకుండా చేస్తామన్నారు. గత ప్రభుత్వం గ్రామాల్లో వీఆర్‌వో, వీఆర్ఏల వ్యవస్థ లేకుండా చేసిందన్నారు. దీంతో క్షేత్ర స్థాయిలో రైతు భూ సమస్యలు పరిష్కరించేవారే లేకుండా పోయారన్నారు. మరో పక్షం రోజుల్లో 10,956 రెవెన్యూ గ్రామ అధికారులను నియమించనున్నామని అన్నారు. భూ సర్వే కోసం రైతులు ఎక్కువ ఇబ్బందులు పడుతున్నారని ప్రస్తుతం 300ల మంది ప్రభుత్వ సర్వేయర్‌లు ఉన్నార న్నారు. అయితే 1000 మంది ప్రభుత్వ సర్వేయర్‌లను నియమించనున్నామని వీరితో పాటు మరో 6వేల మంది ప్రైవేట్ సర్వేయర్‌లకు లైసెన్స్‌లు ఇవ్వనున్నా మన్నారు. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ప్రతీ నియోజకవర్గానికి 3,500ల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామన్నారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా నమూనా ఇళ్ల నిర్మాణాలు కొనసాగుతున్నాయన్నారు. మే 5లోపు రాష్ట్ర వ్యాప్తంగా 20లక్షల ఇందిరమ్మ ఇళ్లు లబ్ధిదారులకు నిర్మించి ఇస్తామన్నారు. ఇందిరమ్మ ఇళ్ల ప్రక్రియ నిరంతర ప్రక్రియ అని అన్నారు. గూడులేని పేద ప్రజలందరికీ ఇళ్లు నిర్మించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని అన్నా రు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం లక్షల కోట్లు అప్పులు చేసినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం తల తాకట్టుపెట్టైనా హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామని అన్నారు. ఇటీవల బీఆర్ఎస్ నిర్వహించిన సభలో దొర కేసీఆర్ కాంగ్రెస్ అమలు చేస్తున్న సంక్షేమాలను చూసి ఓర్వలేక కడుపు మంటతో అక్కసు వెళ్లగక్కారని మంత్రి మండిపడ్డారు. తర్వాత వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని కేసీఆర్ ఆ పార్టీ నేతలు కలలు కంటున్నారని భవిష్యత్తులో అవి పగటి కలలుగానే మిగిల్చేలా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలకు మాట తప్పకుండా కాంగ్రెస్ ఇందిరమ్మ రాజ్యంలో అన్ని పథకాలను అమలు చేస్తున్నామని మళ్లీ వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని మంత్రి ధీమా వ్యక్తం చేశారు.

భూ భారతితో రైతులకు న్యాయం జరుగుతుంది

● జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్



రైతులకు ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన భూ భారతి చట్టం ద్వారా న్యాయం జరుగుతుందని భూ భారతి చట్టం పేదలతో పాటు న్యాయంగా భూమి ఎవరికి చెందాలో వారికే చెందుతుందని ఆయన తెలియజేశారు. భూ భారతి వ్యవస్థలో రెండంచెల వ్యవస్థను తీసుకువచ్చామన్నారు. ప్రభుత్వం గిరిజనులకు ఇచ్చిన అటవీ భూములకు పట్టాలు లేకపోవడంతో అటవీ శాఖ అధికారులు వాటిని లాగుకున్నారని ఆయన తెలిపారు. భూ భారతి చట్టం అమలైతే రాష్ట్రంలో 100 శాతం రైతుల సమస్యలు పరిష్కారమవుతాయని ఆయన తెలిపారు.

భూమి ఉన్న ప్రతీ పట్టాదారుకు భూధార్ కార్డు

● కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్



భూమి ఉన్న ప్రతీ పట్టాదారుకు ప్రభుత్వం భూధార్ కార్డులను అందజేస్తుందని కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ అన్నారు. భూ భారతి చట్టం చట్టం కాదని రైతులకు ఆయుధం వంటిదని ఆయన తెలియజేశారు. ఈ చట్టంలో రైతులకు ఎలాంటి మోసం జరగడానికి ఆవకాశం లేదని ఆయన తెలిపారు. మ్యూటేషన్ చేయడానికి కాలపరిమితి 30 రోజులు, రైతులకు భూ సమస్యలు పరిష్కరించడానికి తహసీల్దార్ కార్యాలయంలో న్యాయం జరగకపోతే, ఆర్డీవో అక్కడ న్యాయం జరగకపోతే సబ్ కలెక్టర్, అక్కడ న్యాయం జరగకపోతే, కలెక్టర్ అక్కడ జరగకపోతే సీసీఎల్‌ఏలోనూ అక్కడ జరగకపోతే ప్రభుత్వమే లీగల్ ఏయిడ్‌ను ఏర్పాటు చేసిందని ఆయన తెలిపారు. ఇప్పటి వరకు మండలంలో 3,400దరఖాస్తులు వచ్చాయని ఆయన తెలియజేశారు.

1975లో అసైన్డ్ భూమి ఇచ్చారు.. ధరణిలో పట్టా ఇవ్వలేదు

● గగనం కిష్టయ్య, రైతు శెట్పల్లి



1975లో మా నాన్నకు అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం రెండు ఎకరాల భూమి ఇచ్చింది. దానికి సంబంధించిన పేపర్లు ఉన్నాయి. 50 సంవత్సరాలుగా భూమిలో సాగులో ఉన్నాం. మా నాన్న చనిపోయాడు. మా అన్న, నేను సాగులో ఉన్నాం. కానీ ధరణిలో పట్టా ఇవ్వలేదు. పట్టా పాసు పుస్తకం కోసం 10 సంవత్సరాలుగా తహసీల్ కార్యాలయానికి, ఆర్డీవో కార్యాలయానికి, కలెక్టర్ కార్యాలయానికి తిరుగుతున్నాం. కలెక్టర్ పట్టా చేయమన్నా తహసీల్దార్‌లు చేయడం లేదు. అని శెట్పల్లికి చెందిన రైతు గగనం కిష్టయ్య మంత్రికి తెలియజేశారు. మంత్రి వెంటనే తహసీల్దార్‌ను వివరణ కోరగా ఆ సర్వే నెంబర్‌లో 100 ఎకరాల భూమి ఉంటే అంత కంటే ఎక్కువ మందికి పట్టాలు ఉన్నాయి. అందుకే అక్కడ భూమి లేకపోవడంతో పట్టా పాసుబుక్ ఇవ్వలేకపోయాం. ఎవరికి ఎక్కువ ఉందో గుర్తించి రైతుకు న్యాయం చేస్తామని తెలియజేశారు.

పట్టా కాలేదు.. పాస్‌బుక్ రాలేదు

● నక్క భూదెవ్వ, రైతు శెట్పల్లి



నాకు ఎకరం 30 గుంటల భూమి ఉంది. గతంలో పాసు బుక్ వచ్చింది ధరణిలో పాస్‌బుక్ రాలేదు. 10 సంవత్సరాలుగా పట్టా పాస్‌బుక్ కోసం కార్యాలయం చుట్టూ తిరుగుతున్నానని అని ఆమె మంత్రి దృష్టికి తీసుకురాగా మంత్రి తహసీల్దార్‌ను వివరణ కోరగా అట్టి భూమి సెక్షన్ 4 కింద ఉందని భూ భారతిలో న్యాయం చేస్తామని చెప్పారు.

ఇందిరమ్మ ఇళ్లను త్వరితగతిన పూర్తి చేయాలి



రైతునగర్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న దృశ్యం

బీర్కూర్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి అనిల్ కపూర్ లబ్ధిదారులకు సూచించారు. మంగళవారం ఆయన ఎంపిడిఓ మహబూబ్‌తో కలిసి రైతు నగర్ గ్రామాలలో పర్యటించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్టుగా రైతు నగర్ గ్రామాన్ని ఎంచుకుంది. ఈ గ్రామానికి 15 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసింది. ఇందులో భాగంగా నాలుగు ఇళ్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి.

ప్రత్యేకాధికారి అనిల్‌కమార్

అయితే అధికారులు ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని లబ్ధిదారులకు సూచించారు. అనంతరం వీరాపూర్ గ్రామానికి చేరుకుని గ్రామంలోని పల్లె ప్రకృతి వనం, కంపోస్టు షెడ్, వైకుంఠ ధామం, నర్సరీలను పరిశీలించారు. గ్రామంలో మంచి నీటి సమస్య ఏమైన ఉందా అని స్పెషల్ ఆఫీసర్ ఆరా తీశారు. వేసవి కాలం దృష్ట్యా గ్రామాల్లో తాగు నీటి సమస్య తలెత్తకుండా పంచాయతీ కార్యదర్శులు పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట ఎంపిడిఓ మహబూబ్, పంచాయతీ కార్యదర్శులు, లబ్ధిదారులు తదితరులు ఉన్నారు.

నసురుల్లాబాద్: ఇందిరమ్మ ఇంటి నిర్మాణం వేగవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి దయానంద్ అన్నారు. మంగళవారం మండలంలోని రాముల గుట్ట తండాలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనలకు అనుగుణంగానే పనులు చేయించాలని, నిబంధనలు పాటించని వారికి బిల్లులు రావని హెచ్చరించారు. నిబంధనల ప్రకారం నిర్మించుకున్న ప్రతి ఒక్కరికి విడతలవారీగా బిల్లులు వస్తాయని ఆయన అన్నారు.. ఆయన వెంట ఎంపీడీవో సూర్యకాంత్, ఏపీవో సౌజన్య, అధికారులు, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

సన్న బియ్యం పథకం చరిత్రలో నిలిచిపోతుంది

● పీసీసీ ప్రధాన కార్యదర్శి బద్దం ఇంద్రకరణ్‌రెడ్డి

భిక్కనూరు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి) రేషన్ దుకాణాల్లో సన్న బియ్యం పథకం చరిత్రలో నిలిచిపోతుందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బద్దం ఇంద్రకరణ్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పాత రాజు అన్నారు. మంగళవారం మండలంలోని బస్వాపూర్ గ్రామంలో కూరకుంద సంతోష ఇంట్లో సన్నబియ్యం లబ్దిదారులతో కలిసి రేషన్ దుకాణంలో పంపిణీ చేసిన సన్నబియ్యంతో వారు భోజనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదలు సైతం ఉన్నత కుటుంబాల మాదిరిగానే ప్రతిరోజు సన్నబియ్యం తినాలన్న ఉద్దేశ్యంతోనే రాష్ట్ర ప్రభుత్వం రేషన్ దుకాణాల్లో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని చేపడుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని నేరవేర్చడం జరుగుతుందన్నారు. అన్నివర్గాల ప్రజల అభివృద్దే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. అంతకుముందుగా గ్రామంలో కాంగ్రెస్ నాయకులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం పీసీసీ ప్రధాన కార్యదర్శి, ఏఎంసీ చైర్మన్‌తో పాటుగా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుదర్శన్‌ను గ్రామకాంగ్రెస్ నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు తుడుం జీవన్, గ్రామశాఖ అధ్యక్షుడు చింతనూరి సిద్దరాములు, మల్లారెడ్డి, రామస్వామి, మాజీ సర్పంచ్ తుడుం పద్మస్వామి, రామగల్ల బాబు, స్వామి పాల్గొన్నారు.



బస్వాపూర్‌లో లబ్ధిదారులతో కలిసి భోజనం చేస్తున్న దృశ్యం

దోమకొండలో ఒకరి అదృశ్యం

దోమకొండ, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): దోమకొండ గ్రామానికి చెందిన ఒక వ్యక్తి అదృశ్యమైనట్లు ఎస్సై స్రవంతి మంగళవారం తెలిపారు. గ్రామానికి చెందిన అవధూత నర్సింలు 25న ఉదయం ఇంట్లో నుంచి మేస్త్రి పనికి వెళ్లి వస్తానని చెప్పి తిరిగి ఇంటికి రాకపోవ డంతో అతని గురించి బంధువుల వద్ద వెతికినప్పటికి ఆచూకీ లభించకపోవడంతో అతని కుమారుడు సిద్దిశ్వర్ పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు ఇవ్వగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కొచ్చెరి మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

నసురుల్లాబాద్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మైలారం గ్రామ శివారులో గల కొచ్చెరి మైసమ్మ ఆలయంలో మంగళవారం భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయానికి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కాకుండా వివిధ మండలాల భక్తులు వచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారం కొచ్చేరి మైసమ్మ తల్లి అని అన్నారు. అనంతరం భక్తులు కుటుంబ సభ్యులతో కలిసి ఆలయ ప్రాంగణంలో సహా పంక్తి భోజనాలు చేశారు.. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక సౌకర్యాలు కల్పించారు.

గ్రామాల్లో తాగునీటి ఇబ్బంది లేకుండా చూడాలి

● జిల్లా పంచాయతీ అధికారి మురళి

తాడ్వాయి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): వేసవి కాలం దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి ఇబ్బంది లేకుండా చూడాలని జిల్లా పంచాయతీ అధికారి మురళి అన్నారు. ఈయన మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ కార్యదర్శులు కారోబార్లతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. అనంతరం మాట్లాడుతూ గ్రామాల్లో శానిటైజింగ్ తప్పకుండా చేయాలని సూచించారు. గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు ఉన్నాయని తమ దృష్టికి వస్తే అధికారులపై చర్యలు ఉంటాయని సూచించారు. ప్రతి గ్రామంలోని ట్యాంకులు, మురికి కాలువలు తప్పకుండా శానిటైజింగ్ చేపించే బాధ్యత కార్యదర్శులు కారోబార్ల పైనే ఉందని తెలిపారు. త్రాగునీటి ఇబ్బంది ఉన్న గ్రామాల్లో వాటర్ ట్యాంకర్ ద్వారా నీరు సరఫరా చేయాలని అధికారులకు సూచించారు. ఇందులో మండల అభివృద్ధి అధికారి సయ్యద్ సాజిద్ అలీ, ఎంపీఓ సవిత రెడ్డి, ఆయా గ్రామాల కార్యదర్శులు, కారోబార్లు తదితరులు ఉన్నారు.

నేడు విగ్రహ ప్రతిష్ఠాపన

మద్నూర్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో బుధవారం ఛత్రపతి శివాజీ, మహాత్మా బసవేశ్వర మహారాజ్ విగ్రహాలను ఎంపీ, ఎమ్మెల్యేల చేతుల మీదుగా ఆవిష్కరించనున్నట్లు ఛత్రపతి శివాజీ సంఘం సభ్యులు దత్తు పటేల్ తెలిపారు. మండల కేంద్రంలోని పాత బస్టాండ్ వద్ద గత ఏడాది నిర్మాణం ప్రారంభించిన మహాత్మా బసవేశ్వర్, ఛత్రపతి శివాజీ విగ్రహాల నిర్మాణం పూర్తి కావడంతో ప్రారంభానికి ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమానికి ప్రస్తుత ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు, జహీరాబాద్ ఎంపీ లక్ష్మీకాంతారావు, మాజీ ఎంపీ బీబీ పాటిల్, మాజీ ఎమ్మెల్యేలు హాజరు కానున్నట్లు తెలిపారు.

భూ భారతితోనే రైతులకు మేలు

(5వ పేజీ తరువాయి)

రిజిస్ట్రేషన్ చేసి, హక్కుల రికార్డుల్లో మార్పులు చేసి, పట్టాదారు పాస్ పుస్తకం జారీ చేస్తారని, రిజిస్ట్రేషన్, మ్యూటేషన్ ఒకేరోజు జరిగిపోతుందని సూచించారు. సెక్షన్ 6 ప్రకారం సాదా బైనామాల క్రమబద్ధీకరణ, భూ భారతి చట్టం ద్వారా జరుగుతుందని తెలిపారు. 2014 జూన్ 2 కంటే ముందు గ్రామీణ ప్రాంతాల్లోని వ్యవసాయ భూమిని సాదా బైనామా ద్వారా కొనుగోలు చేసి గత 12 ఏళ్లుగా అనుభవంతో ఉంటూ 12.10.2020 నుంచి 10.11.2020 మధ్య కాలంలో క్రమబద్ధీకరణ కోసం సన్నకారు రైతులు పెట్టుకున్న దరఖాస్తులపై ఆర్డీవో విచారణ చేసి ఆ తరువాత ఉన్న వారి నుంచి ప్రస్తుత రిజిస్ట్రేషన్ స్టాంప్ డ్యూటీ వసూలు చే సి సర్టిఫికెట్ జారీ చేస్తారు. హక్కు రికార్డుల్లో నమోదు చేసి పట్టా పాస్ పుస్తకం అందజేస్తారని వివరించారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ కిరణ్మయి, తహసీల్దార్ ముజీబ్, ఎంపీడీవో రాణి, వ్యవసాయ అధికారి రాజు, సింగిల్ విండో చైర్మన్ శ్రీనివాస్ పటేల్, రామ్ పటేల్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పరమేష్ పటేల్, మండల పంచాయతీ అధికారి వెంకట నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

రాజంపేటలో దొంగ అరెస్టు

రాజంపేట, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సోమవారం రాత్రి విధులు నిర్వహిస్తున్న ప్రేమ్‌సింగ్, మహమ్మద్ అజీమ్‌లకు దొంగ పట్టుబడినట్లు ఎస్ఐ పుష్పరాజ్ తెలిపారు. తెల్లవారు జామున అనుమానాస్పదంగా బండిపై వెళ్తున్న ఒక వ్యక్తిని గమనించి ఆపి వివరాలు ఆరా తీయగా అతని వద్ద వస్తువులు కనిపించాయని అదుపులోకి తీసుకుని విచారణ చేయడంతో దొంగతనాల గురించి బయటపెట్టినట్లు తెలిపారు. భిక్కనూరు, కామారెడ్డి పట్టణంలో చేసిన దొంగతనాల గురించి వివరించాడని అతనిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపామని ఎస్ఐ తెలిపారు.

బీర్కూర్ పీహెచ్‌సీలో ఆరోగ్య శిబిరం

బీర్కూర్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం మహిళా ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 30 ఏళ్లు పై బడిన మహిళలకు వివిధ రకాల క్యాన్సర్, థైరాయిడ్, గర్భకోశ, మూత్ర కోశ వ్యాధులకు సంబంధించిన పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులను పంపిణీ చేశారు. వైద్యాధికారిణీ శ్రీలేఖ, సీహెచ్‌వో రవీందర్, ఎంఎల్ హెచ్ పీలు ప్రీతీ, సాగర్, సూపర్ వైజర్లు నర్సమ్మ, సుశీల, ఆరోగ్య ఆశాకార్య కర్తలు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్ తగిలి పంచాయతీ వర్కర్ మృతి

నాగిరెడ్డిపేట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్ద ఆత్మకూర్ గ్రామానికి చెందిన గ్రామపంచాయతీ వర్కర్ ఎండి. బాబా(35) మంగళవారం సాయంత్రం చిన్న ఆత్మకూర్ గ్రామంలో విద్యుత్ స్తంభాలకు బల్బులు పెడుతుండగా విద్యుత్ షాక్ తగిలి మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఎం డీ. బాబా పెద్ద ఆత్మకూర్ గ్రామ పంచాయతీలో చెత్త తరలించే ట్రాక్టర్ డ్రైవర్‌కు గాను, ఎలక్ట్రిక్ వర్కర్ గాను పనిచేస్తున్నాడన్నారు. మంగళవారం సాయంత్రం చిన్న ఆత్మకూర్ గ్రామంలోని విద్యుత్ స్తంభాలకు విద్యుత్ బల్బులు పెడుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి మృతి చెందినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న స్థానిక ఎస్సై మల్లారెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని జరిగిన ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు సేకరిస్తున్నారు. మృతునికి భార్య సాబేరా బేగం, తొమ్మిది సంవత్సరాల కుమారుడు అశ్వాక్ ఉన్నారు. మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని స్థానికులు కోరుతున్నారు.



సినిమా గైడ్ కామారెడ్డి

కామారెడ్డి	
దర్శన్	- జిమ్ ఖానా
ప్రియా 70	- అర్జున్ సన్ ఆఫ్ వైజయంతి
ప్రియా 35	- సారంగాపాని జాతకం

బాన్సువాడ	
మహేశ్వరి	- ఓదెల 2
వెంకటేశ్వర	- ఒక్కడు

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	110	150	180
వెన్‌కాబ్(కిలో)	:	130	160	190

